జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
న్యూస్ ఈజ్ రైట్
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 15 సంచిక 94 విశాఖపట్నం ఆదివారం 19 డిసెంబరు 2021 8 పేజీలు వెల : 5.00



## నవ తరం అగ్ని ప్రైమ్ మిసైల్ పరీక్ష విజయవంతం

భువనేశ్వర్: ఒడిశాలోని బాలాసోర్ నుంచి అగ్ని ప్రైమ్ మిసైల్‌ను శనివారం విజయవంతంగా పరీక్షించినట్లు భారత ప్రభుత్వ అధికారులు ప్రకటించారు. అగ్ని తరగతి క్షిపణుల్లో ఇది నవతరం క్షిపణి అని తెలిపారు. ఇది 1,000 కిలోమీటర్ల నుంచి 2,000 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగలదని పేర్కొన్నారు. ఈ క్షిపణి బరువు అగ్ని-3 క్షిపణి బరువులో సగం మాత్రమేనని తెలిపారు. శనివారం అగ్ని-పీ క్షిపణి ప్రయోగం సందర్భంగా, దీనికి అనేక కొత్త అంశాలను జోడించి పరీక్షించినట్లు ఓ వార్తా సంస్థ తెలిపింది. ఇది అణ్వాయుధ సామర్థ్యంగల వ్యూహాత్మక క్షిపణి అని పేర్కొంది. అణ్వాయుధ సామర్థ్యంగల ఈ వ్యూహాత్మక క్షిపణికి అనేక కొత్త సామర్థ్యాలు ఉన్నాయని ప్రభుత్వ అధికారి ఒకరు తెలిపారు. శనివారం నిర్వహించిన పరీక్ష విజయవంతమైందని, ఈ మిషన్ లక్ష్యాలను అత్యున్నత స్థాయి కచ్చితత్వంతో చేరుకుందని తెలిపారు.

# యోగి వైపే యూపీ ప్రజలు..

### ప్రధాని నరేంద్రమోదీ కీలక వ్యాఖ్యలు



ఉత్తరప్రదేశ్: ఉత్తరప్రదేశ్‌లో శాంతి భద్రతలు సరిగా లేకపోవడం వల్ల ఈ ప్రాంతం నుంచి ప్రజలు ఒకప్పుడు వలస వెళ్లేవారిని.. సీఎం యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం హాయంలో మాఫియా శకం ముగిసిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. గత 4, 5 ఏళ్లలో మాఫియాల అనధికార ఆస్తులను యోగి బుల్‌డోజర్లతో ధ్వంసం చేసి.. శాంతి భద్రతలను కఠినంగా అవలంభిస్తూ.. ప్రజలకు వారి నుంచి విముక్తి కల్పించారని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్ జిల్లాలో ప్రతిష్టాత్మక గంగా ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టుకు ప్రధాని నరేంద్ర మోదీ శనివారం శంకుస్థాపన చేశారు. ఎక్స్‌ప్రెస్‌వే దేశంలోనే అతి పొడవైన వాటిలో ఒకటి. పశ్చిమ, తూర్పు ఉత్తరప్రదేశ్‌లను అనుసంధానిస్తూ.. పన్నెండు జిల్లాలను కలుపుతుంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 594 కిలోమీటర్ల ఎక్స్‌ప్రెస్‌వే దేశంలోనే అతి పొడవైనదని పేర్కొన్నారు. ఇది ఉత్తరప్రదేశ్ అభివృద్ధికి కొత్త తలుపులు తెరుస్తుందని ప్రధాని మోదీ అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ.. యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను ప్రశంసించారు. యోగి.. మాఫియాలను తొలగించి.. అభివృద్ధి పనులను ముమ్మరం చేశారని కొనియాడారు. ఇప్పుడు ప్రజలు (యుపి ప్లస్ యోగి బహుత్ హై ఉపయోగి) మరోసారి యోగిని ఎన్నుకుంటే.. మరింత ప్రయోజనం చేకూరుతుందంటూ పేర్కొం టున్నారని మోదీ అన్నారు. మాఫియాల అనధికార ఆస్తులను యోగి బుల్‌డోజర్లతో ధ్వంసం చేశారని.. వారిని అనుసరిస్తున్న ఈ ఘటనలు బాధ కలిగించాయని విపక్షాలపై ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం వ్యక్తంచేశారు. యూపీలో ఇంతకుముందు ప్రాజెక్టులు కాగితాలపైనే ఉన్నాయని.. ఇప్పుడు అభివృద్ధి అంటే ఏంటో కనిపిస్తుందని (మిగతా 7లో..)



## పాక్‌లో పేలుడు..

### 12 మంది మృతి

కరాచీ: పాకిస్థాన్ కరాచీ షేర్షా పరాచా చౌక్ ప్రాంతంలోని ఓ భవనంలో పేలుడు సంభవించి 12 మంది చనిపోయారు. పలువురు గాయపడ్డారు. శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పలువురి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. పేలుడుకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## మద్యంపై వ్యాట్‌ను క్రమబద్ధీకరించిన ఏపీ సర్కార్



విజయవాడ: మద్యంపై వ్యాట్‌ను ఏపీ ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. వ్యాట్‌తో పాటు స్పెషల్ మార్జిన్, అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీ సవరిస్తూ రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. దీని ద్వారా రాష్ట్రంలో మద్యం ధరలు తగ్గనున్నాయి. బీర్లపై వ్యాట్ 10 నుంచి 20 శాతం తగ్గనుంది. స్పెషల్ మార్జిన్ 36 శాతం, అడిషనల్ ఎక్సయిజ్ డ్యూటీ 36 శాతం తగ్గనుంది. మొత్తంగా బీర్లపై 20 నుంచి 30 రూపాయల వరకు తగ్గే అవకాశం ఉంది. ఐఎంఎల్ లిక్కర్‌పై వ్యాట్ 35 నుంచి 50 శాతం తగ్గనుంది. స్పెషల్ మార్జిన్ 10 నుంచి 20 శాతం, అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీ 5 నుంచి 26 శాతం తగ్గనుంది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే అక్రమ మద్యం అడ్డుకట్ట వేసేందుకు వ్యాట్ క్రమబద్ధీకరించినట్లు రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ రజత్ భార్గవ తెలిపారు.

# పాపాఘ్నిపై రూ.60 కోట్లతో కొత్త వంతెన

### జమ్మలమడుగు వద్ద పెన్నానది వంతెనపై రూ.10 కోట్లతో పియర్ నిర్మాణం



అమరావతి: వైఎస్సార్ జిల్లా కమలాపురం సమీపంలోని పాపాఘ్ని నదిపై కొత్త వంతెన నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదించింది. పాపాఘ్ని నదిపై 1977లో నిర్మించిన భారీ వర్షాల కారణంగా నవంబర్ 20న కుంగిపోయిన విషయం తెలిసిందే. మూడు రోజులు వరద గరిష్ట స్థాయికి చేరడంతో ఆ వంతెన కుంగింది. అప్రమత్తమైన ప్రభుత్వం వెంటనే ఆ వంతెన పైనుంచి రాకపోకలను నిలిపేసింది. దీంతో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఇతరులు సమీపంలోని రైలు వంతెన మీద నుంచి నడిచి వెళ్లాల్సివచ్చింది. అది ప్రమాదకరమని గుర్తించిన ప్రభుత్వం వెంటనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. కూలిన పాపాఘ్ని వంతెనకు ఓ వైపున పలకలు వేసి పాదచారులు రాకపోకలు సాగించేందుకు అవకాశం కల్పించింది. (మిగతా 7లో..)

## కేంద్ర విపత్తుగా ప్రకటించాలి: సీపీఐ రామకృష్ణ



కర్నూలు: ఇటీవల రాయసీయంలో కురిసిన అధిక వర్షాలకు జరిగిన నష్టాన్ని కేంద్ర విపత్తుగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఇంతవరకూ పంట నష్టం జరిగిన ప్రాంతాల్లో మంత్రులెవరూ పర్యటించలేదన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతులకు 25 లక్షల ఎక్స్‌గ్రేషియ ఇవ్వాలన్నారు. రూ.కోటి ఎక్స్‌గ్రేషియా కావాలంటే విశాఖ వెళ్లి చావాల్సిందేనా అని ఆయన ప్రశ్నించారు. రైతులకు రుణమాఫీ చేసి అప్పుల ఊబి నుండి కాపాడాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

# ముఖ్యమంత్రి అభయంతో ఉత్కంఠకు తెర..

### రాజీనామా చేసిన కీలక నేత..!



కర్నూలు: కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి సంబంధించి వారం రోజులుగా కొనసాగిన ఉత్కంఠకు ఎట్టకేలకు తెరపడింది. ఏకంగా ముఖ్యమంత్రి జోక్యం చేసుకోవడంతో.. ఈ వివాదం సమసింది. రాజకీయ భవిష్యత్తుకు ముఖ్యమంత్రి జగన్ భరోసా ఇవ్వడంతో ఎట్టకేలకు జిల్లా పరిషత్ చైర్మన్ పదవికి వెంకట సుబ్బారెడ్డి రాజీనామా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపిన ఈ వ్యవహారానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని వైసీపీ సీనియర్ నేత ఎర్రబోతుల వెంకటరెడ్డి కి ఇవ్వాలని మొదట అధిష్టానం భావించింది. కొలిమిగుండ్ల జడ్పీటీసీ గా ఏకగ్రీవంగా ఎన్నికైన వెంకటరెడ్డి దురదృష్టవశాత్తు కరోనాతో మృతిచెందారు. దాంతో సంజామల జడ్పీటీసీ వెంకటసుబ్బారెడ్డి ని అనుకోని విధంగా చైర్మన్ పదవి వరించింది. అయితే, ఎర్రబోతుల కుటుంబంలో ఎవరైనా జడ్పీటీసీగా గెలిస్తే వెంకటసుబ్బారెడ్డి రాజీనామా చేయాలని పార్టీ నిర్ణయించింది. ఇందులో భాగంగానే కొలిమిగుండ్ల జడ్పీటీసీకి జరిగిన ఉప ఎన్నికలలో ఎర్రబోతుల వెంకటరెడ్డి కొడుకు పాపిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. (మిగతా 2లో..)



# సంక్షేమ, అభివృద్ధి ఫలాలు నగర ప్రజలకు అందకుండా అడ్డుకుంటున్న టీడీపీ సభ్యులు

**కౌన్సిల్ లో గందరగోళం సృష్టించడమే తెలుగుదేశం ప్రధాన ఎజెండా**

**ఓటీఎస్ పై తెలుగుదేశం విమర్శలు అర్ధరహితం**

**వాంబే కాలనీవాసుల వద్ద రూ. 65 వేలు కట్టించుకొని నిలువుగా మోసగించింది టీడీపీ ప్రభుత్వం కాదా..?**

**వీఎంసీ మీడియా పాయింట్ వద్ద నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు**



విజయవాడ, డిసెంబర్ 18 : ప్రజలకు మంచి చేకూరే కార్యక్రమాలను అడ్డుకోవడమే ప్రతిపక్షాలు పనిగా పెట్టుకున్నాయని ఎమ్మెల్యే మల్లాది విష్ణు గారు తెలిపారు. వీఎంసీ మీడియా పాయింట్ వద్ద శనివారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. తొలి నుంచి కూడా నగర పాలక సంస్థ కౌన్సిల్ సర్వసభ్య సమావేశాలలో ఒకే పంథాను అవలంభిస్తూ.. సభను సజావుగా జరగకుండా ప్రతిపక్షాలు గందరగోళ పరిస్థితులను సృష్టిస్తున్నాయని మండిపడ్డారు. మరీముఖ్యంగా తెలుగుదేశం సభ్యులు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోన్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలు నగర ప్రజలకు అందకుండా అడుగడుగునా అడ్డుపడుతున్నారన్నారు. 2014-19 మధ్యకాలంలో కార్పొరేటర్ నుంచి కేంద్ర మంత్రి వరకు అన్ని స్థాయిలలోనూ అధికారాన్ని అనుభవించిన తెలుగుదేశం నాయకులు.. విజయవాడ నగర ప్రగతికి చేసింది శూన్యమని గుర్తుచేశారు. చంద్రబాబు గత ఐదేళ్ల పాలనలో నగరంలో అభివృద్ధి పనులన్నీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందన్నారు. కానీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారి హయాంలో ప్రతిపక్షాలు ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్ లలోనూ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నట్లు వెల్లడించారు. కుల, మతాలకతీతంగా సంక్షేమ ఫలాలు చివరి గడప వరకు చేరుస్తున్నామన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో తిరస్కరణకు గురైనా.. తెలుగుదేశం నాయకుల తీరులో మార్పు రాకపోవడం శోచనీయమన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన ప్రతిఒక్క హామీని సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారు నెరవేరుస్తున్నారని ఎమ్మెల్యే మల్లాది విష్ణు గారు అన్నారు. లక్షల మంది అవ్వాతాతల మోముల్లో చిరునవ్వులు విరబూసేలా జనవరి 1 నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుకను రూ. 2,250 నుంచి రూ. 2,500 కి పెంచడమే ఇందుకు నిదర్శనమన్నారు. అదేవిధంగా పేద, మధ్య తరగతి ప్రజలకు జగనన్న జన్మదిన కానుకగా సంపూర్ణ గృహ హక్కు పథకాన్ని అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ పథకం పూర్తిగా స్వచ్ఛందమని.. ఇందులో ఎటువంటి బలవంతం లేదని స్పష్టం చేశారు. అదే చంద్రబాబు హయాంలో వాంబే కాలనీ హెచ్ బ్లాక్ కు సంబంధించి 105 మంది లబ్ధిదారులు వద్ద అసలు వడ్డీ కలిపి దాదాపు రూ. 65 వేల వరకు కట్టించుకొని పూర్తి హక్కులు కల్పించలేకపోయారన్నారు. కానీ సీఎం జగన్మోహన్ రెడ్డి గారి ప్రభుత్వం ఓటీఎస్ ద్వారా రూ. 20 వేలకే సంపూర్ణ హక్కులు కల్పిస్తున్నట్లు తెలియజేశారు. అధికారంలో ఉన్నన్నాళ్లు పేదల గూర్చి కనీస ఆలోచన చేయకుండా.. మరలా ముఖ్యమంత్రి అయితే చేస్తానంటూ ప్రతిపక్షనేత చంద్రబాబు మాట్లాడటం విడ్డూరంగా ఉందని మల్లాది విష్ణు గారు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఓటీఎస్ పై నాలుగు సార్లు ఫైల్ పంపించినా.. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు పక్కన పడేశారన్నారు. ఇవాళ మాట్లాడుతున్న వారు ఆ రోజు ఎందుకు డబ్బు కట్టించుకున్నారని ప్రశ్నించారు. విజ్ఞులైన ప్రజలు తెలుగుదేశం నాయకుల దుష్ప్రచారాలను నమ్మే పరిస్థితి లేదని పేర్కొన్నారు. కనుక అర్హులైన ప్రతిఒక్కరూ ఈ రెండు రోజుల్లో ఓటీఎస్ పథకాన్ని సద్వినియోగపరచుకోవాలని సూచించారు. టీడీపీ హయాంలో రూ. 65 వేలు చెల్లించిన లబ్ధిదారులకు కూడా కేవలం నామమాత్రం రుసుము రూ. 10 తో రిజిస్ట్రేషన్లు చేయబోతున్నట్లు గౌరవ శాసనసభ్యులు వెల్లడించారు. మరోవైపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారి జన్మదిన వేడుకలను ఈనెల 21వ తేదీన పర్యావరణ హితంగా జరుపుకోవాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే గారు పిలుపునిచ్చారు. కావున ప్రతిఒక్కరూ తమ వంతుగా ఒక మొక్కను నాటి.. పచ్చదనం పెంపొందించే విధంగా వేడుకలలో పాలుపంచుకోవాలని కోరారు.

## అభివృద్ధిలో అధికారులు స్థానికసంస్థల ప్రజాప్రతినిధులు తోడ్పాటునందించాలి - మంత్రి బాలినేని



ఒంగోలు : అభివృద్ధిలో అధికారులు స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు తోడ్పాటునందించాలని రాష్ట్ర విద్యుత్, అటవి, శాస్త్రసాంకేతిక, పర్యావరణశాఖల మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చెప్పారు. మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు లంకపోతు. అంజిరెడ్డి అధ్యక్షతన జరిగిన, కొత్తపట్నం మండల ప్రజాపరిషత్, నూతనపాలకవర్గతొలి సమావేశానికి, రాష్ట్రమంత్రి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. సముద్రతీరప్రాంతంలో త్రాగునీటిసమస్య శాశ్వత పరిష్కారానికి, సముద్రజలాలను మంచినీరుగామార్చడానికి రూ. 35 కోట్లతో, జిల్లాలోనే తొలిసారిగా నూతనపథకాన్ని ప్రారంభించనున్నట్లు, మంత్రి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కొత్త పట్నంలో విద్యుత్ సమస్యల శాశ్వత పరిష్కారానికి రూ. 16కోట్లతో భూగర్భ విద్యుత్లైన్ల నిర్మాణం చేపడతామని, రెండు సబ్ స్టేషన్లను నిర్మిస్తున్నామన్నారు. కొత్తపట్నం మండలంలో రూ. 11కోట్లతో, 77 గ్రావెల్ రోడ్లను, అలాగే కేంద్రం, రాష్ట్రం నిధులు కలిపి రూ. 15కోట్లతో రహదారులను నిర్మిస్తామని, 18ఎకరాలలో ఫిషింగ్హార్బర్, మరో రెండుఎకరాలలో పర్యాటకప్రాంతం అభివృద్ధిచేస్తామన్నారు. కొత్తపట్నం -ఒంగోలు రహదారి మధ్యలో, బ్రిడ్జి నిర్మాణ పనులు అర్థంతరంగా నిలిచిపోవడంపై మంత్రి ఆరాతీశారు. గుత్తేదారులు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తుంటే అధికారులు చూస్తూ ఊరుకుంటారని అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. వారంరోజుల్లో ప్రారంభించాలని లేకుంటే, గుత్తేదారుని అనర్హుల జాబితాలో చేర్చాలని అధికారులను ఆదేశించారు. బ్రిడ్జినిర్మాణపనులు నిలిచి, ప్రజలుతీవ్రఇబ్బందులు పడుతుంటే, అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని మంత్రి నిలదీశారు. ఏప్రియల్నాటికి పూర్తి చేయాలనిమంత్రి ఆదేశించారు. గృహాల నిర్మాణానికి కోర్టునుంచి అడ్డంకులు తొలిగాయని జిల్లా సంయుక్త కలెక్టర్ (ఆసరా, సంక్షేమం) కె.కృష్ణ వేణి చెప్పారు. సమావేశంలో ఎం.పి.పి. లంకపోతు అంజిరెడ్డి, కొత్తపట్నం ఎమ్.పి.డి.ఓ. పి.సుజాత, తహసిల్దార్ విజయలక్ష్మి, జడ్.పి.టి.సి. సభ్యురాలు లక్ష్మీ శారద, ఎమ్.పి.టి.సి.లు ఆర్. వెంకట్రావు, శాంతారావు, మండల కోఆప్షన్ సభ్యులు బాజి, సర్పంచ్ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి అభయంతో ఉత్కంఠకు తెర..

(మొదటిపేజీ తరువాయి)

దీంతో పాపిరెడ్డి చైర్మన్ అవ్వాలని పార్టీ ఆదేశించింది. ఈ క్రమంలోనే వెంకట సుబ్బారెడ్డిని రాజీనామా చేయాలంటూ గత వారం రోజులుగా ఒత్తిడి తీసుకువచ్చింది పార్టీ. అయితే, తన రాజకీయ భవిష్యత్తు ఏంటి అని వెంకటసుబ్బారెడ్డి అడగటం, రాజీనామా చేసేందుకు విముఖత వ్యక్తం చేయడంతో కాస్త ఉత్కంఠ నెలకొంది. చివరికి ఈ అంశంపై ముఖ్యమంత్రి జగన్ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. రాజకీయ భవిష్యత్తుకు ఇబ్బంది ఉండదని జగన్ హామీ ఇవ్వడంతో ఎట్టకేలకు ఈ రోజు వెంకటసుబ్బారెడ్డి తన చైర్మన్ పదవికి రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని కలెక్టర్ కోటేశ్వరరావు కు అందించారు. దీంతో ఎర్రబోతుల పాపిరెడ్డి కి జిల్లా పరిషత్ చైర్మన్ పదవి అప్పగించేందుకు రంగం సిద్ధమైంది. జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి పాపిరెడ్డి ని చైర్మన్గా ఎన్నుకోవాలని నిర్ణయించింది పార్టీ. రాజీనామా అనంతరం వెంకటసుబ్బారెడ్డి, పాపిరెడ్డి మీడియాతో మాట్లాడేందుకు నిరాకరించారు.

## దత్తక్షేత్రం నందు దత్తహెూమం



వేటపాలెం(ఒంగోలు) : వేటపాలెం, కొత్తపాలెంరోడ్లో ఉన్న దత్తక్షేత్రం నందు, దత్త జయంతిని పురస్కరించుకుని, ప్రాతః కాలంలో ప్రత్యేక పూజలు, ప్రారంభించి, స్వామివారికి పంచామృతములతో, అభిషేకం నిర్వహించారు. తదుపరి ప్రత్యేక అలంకరణ సువర్ణ, రజిత ఆభరణము లతో అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు వసంతరావు అందజేసిన గురుచరితము, సాయి చరితము పుస్తకాలను భక్తులకు పంపిణీ చేశారు. దత్తహెూమం నిర్వహించారు. తదుపరి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. యీ కార్యక్రమంలో ఆలయ కన్వీనర్ కరణం ప్రమీలదేవీ, అధ్యక్షులు ప్రత్తి వెంకటసుబ్బారావు, కార్యదర్శి నున్నా శివప్రసాదరావు, కోశాధికారి గుబ్బం రంగనాయకులు, సహాయ కార్యదర్శి కరణం మురళీకృష్ణ, సుకర్న్ బాబు, జిల్లా పంచాయతీ అధికారి. శివప్రసాద్రావు ప్రత్యేకఅతిథిగా, మహిళా విభాగం సభ్యులు రమాదేవి, పి.రాజేశ్వరి, వాణి, వల్లి, పార్వతి, కుమారి, బ్రహ్మయ్య, తదితరసభ్యులు పాల్గొన్నారు. ఆలయప్రధానార్చకులు నరసింహమూర్తి, రాధామాత, తదితర పురోహితులు ప్రత్యేక పూజలు, దత్తహెూమం నిర్వహించారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ, భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.



## హైకోర్టు న్యాయమూర్తిని, మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించిన ఖలీఫాతుల్లాభాషా

**హైకోర్టు న్యాయమూర్తిగా, బాధ్యతలను స్వీకరించిన, జిల్లా వాసి డాక్టర్.మన్మథరావు**



ఒంగోలు : ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులై, బాధ్యతలను స్వీకరించిన తర్వాత, తొలిసారిగా తన సొంత గ్రామం, ప్రకాశం జిల్లాలోని, సింగరాయకొండ మండలం బింగినపల్లి కి వచ్చిన, జస్టిస్ డాక్టర్.కుంభజడల మన్మథరావుని, బీజేపీ మైనారిటీ మోర్చా ఫార్మేర్ రాష్ట్ర అధ్యక్షుడు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సౌత్ రీజియన్ ఛైర్మన్ షేక్. ఖలీఫాతుల్లాబాషా , మర్యాదపూర్వకంగా కలిశారు. మరియు తన కుమార్తె లాయర్ షేక్. కరిష్మా, కుమారుడు ఆదిల్ ఇన్నోవేషన్ క్లబ్ డైరెక్టర్ షేక్. అహీత్లతో కలసి, ఖలీఫాతుల్లాబాషా, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులై, బాధ్యతలను స్వీకరించిన జస్టిస్ డాక్టర్.కుంభజడల.మన్మథరావుకు, అభినందనలు తెలియజేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్. కుంభజడల మన్మధరావు, లాయర్ షేక్.కరిష్మాని దీవించి, న్యాయవాదివృత్తిలో ఎలానడుచుకోవాలో మెళుకువలు, సూచనలు వివరంగా చెప్పారు. భవిష్యత్లో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. పార్టీలకతీతంగా, సామాజిక సేవాకార్యక్రమములు చేస్తున్న, బీజేపీ మైనారిటీ మోర్చా ఫార్మేర్ రాష్ట్ర అధ్యక్షుడు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సౌత్ రీజియన్ ఛైర్మన్ షేక్. ఖలీఫాతుల్లాబాషాలా, సామాజిక సేవాదృక్పథాన్ని కలిగి, పేద, బడుగు, బలహీనవర్గాల వారికి న్యాయంజరిగేలా, కోర్టులో వాదించాలని లాయర్ షేక్. కరిష్మాని, జస్టిస్ డాక్టర్.కుంభజడల మన్మథరావు ఆశీర్వదించారు.

## రైతుసంక్షేమం కోసం కృషిచేస్తున్న ఎమ్మెల్యే: ఆర్.బి.కె ఛైర్మన్ కావూరి.రమణారెడ్డి



చీరాల(ఒంగోలు) : రైతు సమస్యలను సత్వరం పరిష్కరిస్తున్న, ఎమ్మెల్యే దొరకటం అదృష్టమని, చీరాల మండల ఆర్.బి.కె ఛైర్మన్.కావూరి రమణారెడ్డి అన్నారు. పుల్లాయపాలెం గ్రామములో పొలంబడి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో వరిపొలాలను పరిశీలించారు. రైతులకు పంటలకు సోకే వివిధ తెగుళ్లు, వాటి నివారణకు, నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యల గురించి, రైతులకు అవగాహన కల్పించి, ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్.బి.కె ఛైర్మన్ కావూరి.రమణారెడ్డి మాట్లాడుతూ, రైతుసంక్షేమం కోసం ఎమ్మెల్యే కరణంబలరాం, ఆయన తనయుడు కరణం వెంకటేష్ లు, చేస్తున్న కృషిని వివరిస్తూ, రైతుల సమస్యలు చెప్పిన వెంటనే, సత్వరం పరిష్కరిస్తున్న నేతలు దొరకటం అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కావూరి రమణారెడ్డి, ఎ.ఓ.సుమతి, ఎ.హెచ్.ఓ సుబ్బారావు, వివిధ గ్రామాల ఆర్.బి.కె.అధికారులు పాల్గొన్నారు.





## పట్టణ ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్నిక

పొన్నూరు డిసెంబర్18 (ప్రజా పాలన ప్రతినిధి) :పొన్నూరు పట్టణం ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ ఎన్నిక శనివారం జరిగింది. పట్టణ ఆటో డ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ (ఏ ఐ టి యు సి) 14వ మహాసభల ముగింపు అనంతరం పట్టణ అధ్యక్షుడిగా మిక్కిలి విజయరాజు, కార్యదర్శిగా చెరుకూరి వెంకటేష్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిని ఏఐటియుసి నాయకుడు ఆ రే టి రామారావుతో పాటు యూనియన్ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. అనంతరం అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ పట్టణంలోని ఆటో యూనియన్ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## రైల్వే అండర్ బ్రిడ్జిని పరిశీలించిన ఎమ్మెల్యే రామిరెడ్డి



కావలి, డిసెంబర్ 18, ప్రజాపాలన ప్రతినిధి : పట్టణంలోని వైకుంఠపురం స్థానిక అనపగుంట వద్ద రైల్వే అండర్ బ్రిడ్జ శంకుస్థాపన కార్యక్రమంలో శనివారం ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం రైల్వే అండర్ బ్రిడ్జ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా 38,35మాజీ వార్డ్ కౌన్సిలర్లు మాట్లాడుతు మొన్న కురిసిన భారీ వర్షం కారణంగా అండర్ బ్రిడ్జ రోడ్డు బాగా దెబ్బ తినడం వలన వైకుంఠపురం ప్రజలు , స్కూల్ పిల్లలు ,పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్లామని ఎమ్మెల్యే వెంటనే స్పందించి శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్ ఆర్ సీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## యాజమాన్యాలు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయం: రెవెన్యూ డివిజనల్ అధికారి ఎస్. మల్లిబాబు



కొవ్వూరు,ప్రజాపాలన ప్రతినిధి : శనివారం కొవ్వూరు లో ఉన్న పెట్రోల్ బంకు ల ప్రతినిధులు పార్కుల అభివృద్ధి కోసం చేస్తున్న పనులను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా మల్లిబాబు మాట్లాడుతూ, కేవలం వ్యాపార దృక్పథంతో కాకుండా సామాజిక బాధ్యతగా స్వచ్ఛందంగా ముందుకు రావడం మరికొందరికి స్ఫూర్తిని కల్పింస్తుందని తెలిపారు. ఆర్డీవో ని కలిసిన వారిలో ఐ ఓ సి ..రొంగల శ్రీనివాస్, బిపిసి మోతిలాల్ రూప్ చంద్, హెచ్ పి .. ఎస్ వివి ఉషా సత్యనారాయణ, కాకర్ల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## ప్రతి పౌరుడు బాధ్యతగా విద్యుత్తును పొదుపు చేయాలి: ట్రాన్స్ కో యస్ఇ




కావలి , డిసెంబర్ 18, ప్రజా పాలన ప్రతినిధి:విద్యుత్ పొదుపులో జాతి సంక్షేమం ముడిపడి ఉన్నందున ప్రతి పౌరుడు విద్యుత్ ని పొదుపుగా వినియోగించాలని ట్రాన్స్ కో యస్.ఇ విజయకుమార్ రెడ్డి పేర్కొన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా శనివారం కావలి డి.ఇ శ్రీ ధర్ రెడ్డి నిర్వహించిన ప్రదర్శన లో ముఖ్య అతిథిగా ఎస్ఇ విజయకుమార్ రెడ్డి పాల్గొని పొదుపు వారోత్సవాల లక్ష్యం వివరించారు. పెరుగుతున్న జనాభా కి అనుగుణంగా విద్యుత్ కి కావాల్సిన ముడి వనరుల కొరత ఏర్పడే ప్రమాదం ఉందని అన్నారు. దీని దృష్ట్యా పూర్వీకులు మనకు ఇచ్చిన వనరులను రక్షించుకునేందుకు ప్రతి పౌరుడు బాధ్యత గా విద్యుత్ పొదుపు చేయాలని సూచించారు. ఆర్ డి ఒ శ్రీ నా నాయక్ మాట్లాడుతూ ఒక యూనిట్ పొదుపు చేస్తే రెండు యూనిట్లు ఉత్పత్తి చేసినట్లు అని, జాతి భవిత కోసం అందరం భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. ఇన్చార్జి డి.ఇ టి.శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి 20 వరకు ప్రజలను చైతన్య పరుస్తూ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు.

# నిరుద్యోగులను ముంచే వైసీపీ ప్రభుత్వానికి 2024లో గుణపాఠం చెబుతాము: తెలుగు యువత




గోనెగండ్ల ప్రజాపాలన న్యూస్:తెలుగు యువత రాష్ట్ర కమిటీ,మరియు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ శాసనసభ్యులు డాక్టర్ బివి జయనాగేశ్వర రెడ్డి గారి ఆదేశాల మేరకు గోనెగండ్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల తెలుగు యువత సమావేశం నిర్వహించడం జరిగిందని తెలుగు యువత మండల అధ్యక్షుడు రంగస్వామి నాయుడు అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత తమ చదువుకు,నైపుణ్యాలకు,సరిపడ ఉద్యోగాలు కావాలని కోరుకుంటున్నారని అందుకు ప్రభుత్వము ఉద్యోగ కల్పనలో విఫలమైనదని అన్నారు.పరిశ్రమల స్థాపనకు కావలసిన సౌకర్యాలు,ముఖ్యంగా రవాణా సౌకర్యాలు,నీటివసతి,విద్యుత్,పరిశ్రమలు స్థాపించే వారికి భద్రత,భరోసా కల్పించాలని కాని ఈ రోజు అస్తవ్యస్త పరిపాలన వల్ల రవాణా వ్యవస్థ నాశనం అయ్యిందని రోడ్లు గుంతల మాయమై నరకానికి దారుల్లా మారాయని వాపోయారు.ప్రత్యేక హొదాను అధికారంలోకి వేము వస్తే తప్పకుండా కేంద్రం మెడలు వంచి తెస్తామన్న ఈ వైసీపీ ప్రభుత్వం కేసులకు భయపడి కేంద్రానికి దాసోహం అయ్యాయని వాపోయారు.ప్రత్యేక హొదా,రైల్వే జోన్ కూడా సాధించుకొలేకపోయినా దద్దమ్మ ప్రభుత్వం అని ఎద్దేవా చేశారు,రైల్వే జోన్ వల్ల మరింత రవాణా సౌకర్యాలు పెరిగేవి,మీ రాజకీయ స్వార్ధ ప్రయోజనాల వల్ల పార్లమెంట్లో 23 స్థానాలు ఉన్న మీ వైసీపీ ప్రభుత్వం ఎవరూ పార్లమెంట్లో గట్టిగా నోరు విప్పలేని నిస్సహాయక స్థితిలో ఉన్నారని అన్నారు.ఇక ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో ఎలాంటి ప్రోత్సాహకాలను,స్పష్టమైన పారిశ్రామిక విధానాలను, ప్రకటించక పోవడంతో ఎవ్వరు మన రాష్ట్రం వైపు,పరిశ్రమల స్థాపనకు కన్నెత్తైన చూడక పోగ ఉన్న పరిశ్రమలు వేరే రాష్టలకు వెళ్ళి పోతున్నాయన్నారు.రాష్ట్రంలో అధికార పార్టీ నాయకులు దందాలు,దౌర్జన్యాలు,విపరీతంగా పెరిగి పోవడంతో యాజమాన్యాలు బెంబేలెత్తి తమ పరిశ్రమలను పక్క రాష్ట్ర లకు తరలిస్తున్నారన్నారు.ఇక ప్రభుత్వ ఉద్యోగాల విషయానికి వస్తే 2.25 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని అధికారంలోకి వచ్చి కేవలం12 వేల ఉద్యోగాలకు మాత్రవే నోటిఫికేషన్లు ఇచ్చి నిలువునా నిరుద్యోగులను ముంచిందని,ఇక %ఙాజ% ఉసెలేదని పోలీసుల నియామకాలు పోస్టులు కూడా వందల్లో ఇవ్వడం నిరుద్యోగుల పట్ల ప్రభుత్వానికీ ఉన్న చిత్తశుద్ధి ఎంటో అర్థమైందని రాబోయే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికీ గుణపాఠం చెప్పి టీడీపీ పార్టీని అధికారంలోకి తీసుకురావడవే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు.ఇక నైపుణ్య అభివృద్ధి కేంద్రాల స్థాపనకు కావలసిన భవనల నిర్మాణాలకు కాంట్రాక్టర్లు ఎవ్వరు ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి చూసి ముందుకు రాక పోవడంతో ఆ పథకం కాస్త అటకెక్కెల ఉందని అన్నారు.ఇలాంటి పరిస్థతుల్లో నిరుద్యోగ యువత మేల్కొని ప్రభుత్వంతో పోరాడక పోతే భవిష్యత్ అందకారమయ్యే అవకాశముందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి లింగందిన్నె సందీప్ నాయుడు, టీడీపీ పెద్దనెలాటూర్,గాజులదీన్నే గ్రామ అధ్యక్షులు బసవరాజు స్వామీ,ప్రభాకర్ నాయుడు,టీడీపీ వార్డు మెంబర్లు జిలానీ బాషా,పూజరీ రంగస్వామి,తెలుగు యువత మండల ఉపాధ్యక్షులు ఐరన్ బండ బాషా,చిన్న నేలాటూర్ హరికృష్ణ, విల్లిగుండ్ల జయపాల్,తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి పూజరీ లక్ష్మీ కాంత్ స్వామి,తెలుగు యువత కార్యదర్శులు పుట్టపాశం గోవర్ధన్ నాయుడు,శ్రీనివాసులు,వేముగోడు అంపన్న,గోనెగండ్ల టీడీపీ సోషల్ మీడియా అధ్యక్షుడు రాంపురం రఫిక్ బాషా,తెలుగు యువత కార్యవర్గ సభ్యులు విజయ్ కుమార్,ఐరన్ బండ మహబూబ్ బాషా,వేముగోడు పాండురంగడు,చిన్ననేలాటూరు రంగస్వామి, పూజరీ చిన్నా,నాగరాజు, ఆహొబిలం,

## రాష్ట్ర ఎస్సీ కమిషన్, చైర్మన్ ను ఘనంగా సన్మానించిన దళిత సంఘాల నాయకులు



చిలకలూరిపేట(ప్రజాపాలన ప్రతినిధి.) ఒంగోలులో ప్రధానమైన కార్యక్రమానికి వేళ్ళుతూ మార్గమధ్యంలో చిలకలూరిపేటలో సంజీవ నగర్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించిన ఎస్సీ, కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ ఘన నివాళులర్పించారు. సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ మద్దిరాల విశ్వనాథం ఎస్సి కమిషన్ న్ను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు సమతా సైనిక్ దళ్ జిల్లా ఉపాధ్యక్షులు,వంజా ముత్తయ్య, కొప్పుల జ్యోతి రత్నబాబు,సాతులూరు రవి,వడ్లన అంకమ్మరావు,బీఎస్పీ పార్టీ నల్లపు నల్లపు కోటేశ్వరరావు ,వెంగళ రాయుడు,పాపారావు, భక్తవత్సల రావు, లోక్ సత్తా పార్టీ రాష్ట్ర నాయకులు భానుప్రసాద్, ఎమ్మార్పీఎస్ జిల్లా వ్యవస్థాపక అధ్యక్షులు అడపా మోహన్, చెల్లి రాంబాబు, అన్నల శ్యామ్ పాల్, మాదాసు నిరీక్షణ, సాతులూరు బసవయ్య,మూకిరి కోటి, కొమ్ము రాజేష్, హరిబాబు,కొప్పుల రత్న భాయ్,పొనుగు పాటి రాజా తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కును కాపాడుకుందాం.. రాజకీయ పార్టీలు ఏకం కావాలి: జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి తోట రాజా రమేష్




చిలకలూరిపేట: జనసేన పార్టీ కార్యాలయం నందు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేకిస్తూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు డిజిటల్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తోట రాజా రమేష్ మాట్లాడుతూ ఆంధ్రుల ఆత్మ గౌరవం విశాఖ ఉక్కు ని కాపాడే దిశగా మన రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల పార్లమెంట్ సభ్యులు సేవ్ వైజాగ్ స్టీల్ ప్లకార్డుల ను పార్లమెంట్ సమావేశాలలో ప్రదర్శించాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తమ గొంతును గట్టిగా వినిపించాలని, రాష్ట్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలను, అన్ని కార్మిక సంఘాలతో అఖిలపక్షం ఏర్పాటు చేసి ఢిల్లీ పెద్దలతో చర్చించి విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే విధంగా ప్రయత్నం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు మునీర్, కాకుమాను రమేష్, భాష, కోటేశ్వరమ్మ, సాయి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ప్రజా ప్రతినిధులు గ్రామాల అభివృద్ధి పై దృష్టి సారించాలి: ఎమ్మెల్యేమొండితోక జగనమోహన్ రావు




నందిగామ డిసెంబర్ 18 ప్రజాపాలన ప్రతినిధి:పట్ట ణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అరిగెల సుందరమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహిం చిన సర్వసభ్య సమావేశంలో ముఖ్యఅతిథిగా శాస నసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు పాల్గొన్నారు.అనంతరం పలుశాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సం ద ర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయా లని ,అదేవిధంగా గ్రామాల్లో తాగునీటి సరఫరా పై ప్ర త్యేక దృష్టి పెట్టాలని ,ఆరోగ్య కేంద్రాలు –అంగన్వాడి కేంద్రాల పనితీరును పర్యవేక్షిస్తుండాలని, అధికారు లు కూడా గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ఉండాలని సూ చించారు అదేవిధంగా ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన ప్రతి ఒక్కరూ గ్రామాల అభివృద్ధికి దృష్టిసారించాలని ముఖ్యంగా గ్రామంలో ప్రతి సమస్యపై అవగాహన కలి గినప్పుడే ప్రజల అభిమానం పొందడటానికి వీలుఉం టుందన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ ఆగ్రో డెవలప్మెం ట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంగునురు కొండారెడ్డి ,జడ్ పి టి సి సభ్యులు గాదెల బాబు, వైస్ ఎంపీపీ ,ఎంపిటిసి లు, సర్పంచ్ లు, పలు శాఖల అధికారులు ,వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## దత్త సాయి సన్నిధి లో ఘనంగా గురుదత్త పాదుక పూజ,ముఖ్య అతిధిగా మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని



చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)పట్టణములోని శ్రీ దత్త సాయి అన్నదాన సమాజము, జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యములో వేంచేసియున్న శ్రీ దత్త సాయి సన్నిధి లో శ్రీ దత్త జయంతి సందర్భముగా 108 మంది భక్తులచే గురు దత్త పాదుక పూజ ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య ఆతిధులుగా పట్టణ మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాణి పాల్గొని పట్టణ, నియోజకవర్గ ప్రజలు అందరు ఆయుఆరోగ్యాలతో ఉండాలని కోరారు.అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు.అనంతరం ఆళహరి శ్రీనివాసరావు పొన్నూర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్థిక సహకారంతో 300 మందికి అన్నదాన కార్యక్రమం జరిగింది.పూజ కార్యక్రమాలు అన్ని దాతల సహకారంతో జరిగాయని ట్రస్ట్ చైర్మన్ పూసపాటి బాలాజి తెలిపారు. పూజ కార్యక్రమంలన్ని పవనకుమార్ ఆచారి చేతుల మీదుగా నిర్వహించారు.దత్త నామముతో ఆ ప్రాంత మంత కోలాహలంగా సాగింది. ఈ కార్యక్రమంలో కొత్తూరిహనుమంతురావు,మానేపల్లి సుధాకర్,మహిళ భక్తులు అధిక సంఖ్య లో పాల్గొన్నారు.



## రక్తదానం చేయండి... మీ తోటి వారికి ప్రాణభిక్ష పెట్టండి: కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు లంకా రఘురామిరెడ్డి



చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)యడ్లపాడు మండల పరిధిలోని ని తిమ్మాపురంలో ఉన్న తిరుమల కాటన్ మిల్లులో శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ పండరీపురం అద్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరం జరిగింది. తిరుమల ఆయిల్, కాటన్, స్పిన్నింగ్ మిల్లులకు చెందిన ఉద్యోగులు, కార్మికులు స్వచ్ఛందగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కాటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు లంకా రఘురామిరెడ్డి మాట్లాడు ప్రతి నెల ఏదో ఒక కాటన్ పరిశ్రమలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. రక్త దానం చేయడం ద్వారా మరో మనిషికి ప్రాణ భిక్ష పెట్టేనట్టేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమల యజమానులు కోటి రావు, రాఘవరావు, రోటరీ అధ్యక్ష కార్యదర్సులు డి.వెంకటరావు, డి.పుల్లయ్య, కోశాధికారి రాఘవయ్య, చెంచు పున్నయ్య, దివ్వెల సుబ్రమణ్యం, కె.ఎస్.ఆర్. ప్రసాద్ రాజు, అలంగార్ మోహన్, తో పాటు రెడ్ క్రాస్ సిబ్బంది, పరిశ్రమలో పని చేసే సిబ్బంది వున్నారు.

## విద్యుత్ పొదుపు వారోత్సవాల ర్యాలీ నిర్వహించిన విద్యుత్ ఉద్యోగులు



చిలకలూరిపేట:(ప్రజాపాలన ప్రతినిధి)విద్యుత్ పొదుపు వారోత్సవాల లో భాగంగా నేటి సత్ సంకల్పం రేపటి వెలుగులు అంటూ ఆంధ్రప్రదేశ్ కేంద్ర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సి.ఆర్.డి.ఏ సర్కిల్ అమరావతి – చిలకలూరిపేట డివిజన్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ అధికారులు , ఉద్యోగులు శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. 3 లేదా అంతకంటే ఎక్కువ స్టార్లు ఉన్న గృహొపకరణాలు వాడుదాం.. 25 శాతం నుండి 50 శాతం వరకు విద్యుత్ పొదుపు చేద్దాం...ఆదా చేద్దాం .భావితరాలకు భరోసానిద్దామని నినదించారు. సుబ్బయ్య తోట లోని సబ్ స్టేషన్ వద్ద నుంచి గడియార స్తంభం వరకు ర్యాలీ జరిగింది. అనంతరం అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు డివిజన్ ఈఈ, రమేష్ చిలకలూరిపేట డి ఈ రామ్ బొట్లు, ఏఈలు భార్గవి, ఉమహేశ్వరరావు, సుప్రకాష్ నాయక్, ప్రసాద్, సాంబశివరావు, లైన్ మెన్ లు, లైన్ ఇన్ స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## వల్లభనేని వంశీ ఆర్థిక సాయం

గన్నవరం, ప్రజాపాలన ప్రతినిధి డిసెంబర్ 18: ఉంగుటూరు మండలంలోని గారపాడు గ్రామానికి చెందిన పాస్టర్ కాటూరి నిరంజన్ గారి తండ్రి గారు జార్జ్ ముళ్ల గారు వల్లభనేని వంశీ గారు రాజకీయాలు ప్రారంభించినప్పటి నుండి నమ్మకంతో,చేదోడువాదోడు గా ఉంటూ అనేక సేవ కార్యక్రమాలు చేసేవారు,వారు గత కొంత కాలం మరణించగా.జార్జ్ ముళ్లరా గారి ప్రార్ధన మందిరం కట్టడం అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఆ బాధ్యతలు మొత్తం వారి కుమారుడు పాస్టర్ కాటూరి నిరంజన్ కుమార్ గారిపై పడడంతో సహాయం నిమిత్తం శాసనసభ్యులు వారిని కలువగా తక్షణమే స్పందించిన శాసనసభ్యులు డా.వల్లభనేని వంశీ గారు ప్రార్ధన మందిరం అభివృద్ధికి మరియు కుటుంబ అవసరాలకు రూ.1,00,000 /– అందచేశారు.గన్నవరం నియోజకవర్గ వైస్సార్సీపీ కార్యాలయంలో సదరు మొత్తాన్ని శాసనసభ్యులు వల్లభనేని వంశీ గారి ఆదేశాల మేరకు నియోజకవర్గ నాయకులు,ప్రజాప్రతినిధులు చేతులమీదుగా అందచేశారు.



PAY BACK TO SOCIETY SNEHA CLUB

స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob

Dr. N. Venkateswarlu Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046, 7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

# ప్రజాపాలన

సంపాదకీయం

ఆదివారం 19, డిసెంబరు 2021


## ప్రకృతి సాగుకు పందిరేయాలి

వ్యవసాయ రంగానికి కొత్త దిశానిర్దేశం చేశారు ప్రధాని నరేంద్ర మోదీ. రసాయన పరిశోధనా లయాల నుంచి వ్యవసాయాన్ని ప్రకృతి ఒడిలోకి నడపమని దేశ రైతాంగాన్ని వినమ్రంగా కోరారు. రైతును కష్టాల కాష్టంలోకి నెడుతూ... తప్పుగా నడుస్తున్న సాగుబడిని సహజ వ్యవసాయంగా మార్చుకొని, 'తిరిగి మూలాల్లోకి' వెళదామని హితవు పలికారు. దేశీయ సంప్రదాయిక తెలివికి ఆధునిక శాస్త్ర సాంకేతికత జోడించి, వాతావరణ మార్పు సంక్షోభంలో అలమటిస్తున్న ప్రపంచానికి కొత్త టానిక్ ఇద్దామన్నారు. భారత్‌ని ప్రపంచ శీర్షభాగాన నిలుపుదామని పిలుపిచ్చారు. వ్యవసాయంభూసార పరిరక్షణఆహారోత్పత్తిపంపిణి... ఇలా ఒకటికొకటి ముడివడి ఉన్న పలు విష యాల్లో పరివర్తన చివరకు మనిషి జీవనశైలి మార్పు వరకూ వెళ్లాలని అభిలషించారు. ఆర్తితో ప్రధాని చేసిన ప్రతిపాదన బాగుంది. స్వాగతించదగ్గ గొప్ప మలుపు. పెట్టుబడి వ్యయాన్ని రమా రమి తగ్గించి దిగుబడిని పెంచే శాస్త్రీయ విజయసూత్రమూ ఇదేనని ఆయన నొక్కి చెప్పారు. ప్రకృతి వ్యవసాయంపై గుజరాత్‌లో జరిగిన ఓ సదస్సు వేదిక నుంచి, అక్కడి సభికులనే కాక, ఈపద్ధతి ద్వారా దేశం నలుమూలలా దాదాపు 8 కోట్ల మంది రైతుల్ని ఉద్దేశించి ఆయనీ ప్రసంగం చేశారు. 'నీరు రావడానికి ముందే వంతెన నిర్మించాలి' అని అర్థం వచ్చే గుజరాతీ సామెతనూ ఆయన ఉటంకించారు. సామెతలో చెప్పినట్టే, ప్రకృతి వ్యవసాయం వైపు దేశ రైతాంగాన్ని మళ్లించడమే కేంద్ర ప్రభుత్వ విధానమయితే... తగినంత ముందుగానే చేయాల్సింది చాలా ఉంది. విధానపర మైన పూర్వరంగం, ఆర్థిక నిర్ణయాలు, ఆచరణాత్మక చిత్తశుద్ధి ఇందుకు ఎంతో అవసరం. కార్పొరేట్ శక్తుల కనుసన్నల్లో కంపెనీ లాబీలకు వశపడి, ప్రకృతి వ్యవసాయంపై వికృత వ్యాఖ్యలు చేసే శాస్త్రవేత్తల మూక ఆలోచనల్ని సమూలంగా మార్చాలి. మొత్తం వ్యవసాయ రంగమే దిశ మార్చుకునే సంధి కాలంలో... రైతులకు ప్రోత్సాహకాలివ్వాలి. కొత్త పద్ధతికి సానుకూలంగా ఆహారోత్పత్తి పంపిణిమార్కెట్ వ్యవస్థల్ని పటిష్టపరచాలి. అవేవీ లేకుండా, దేశ జనాభాలో సింహ భాగమైన రైతాంగాన్ని ఆకట్టుకునేందుకు ఇది ఉత్తుత్తి ప్రసంగమే అయితే, సమీక్షే అవసరం లేదు. ఉద్యమిం చిన రైతాంగం దీక్షకు లొంగి మూడు వ్యవసాయ చట్టాల్ని వెనక్కి తీసుకున్న అక్కసుతోనో, పాలక బీజేపీ సిద్ధాంత పునాది ఆరెస్సెస్ అభిమానించే దేశీ ఆవుకు ప్రాధాన్యత ఉందనో... ప్రకృతి వ్యవ సాయంపై కేవలం సానుభూతితో మాట్లాడితే ఒరిగేదేమీ ఉండదు. నిజమైన కార్యాచరణ కావాలి. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో గాని, అంతకు ముందే అయినా ఇందుకవసరమైన విధానఆర్థిక ప్రక టన వెలువడాలి. వ్యూహరచన జరగాలి. జన్యుమార్పిడి విత్తనాలు, విష రసాయన ఎరువులు, క్రిమి సంహారకాల పీడ వదిలించుకొని వ్యవసాయం క్రమంగా సహజసిద్ధ సాగువైపు మళ్లాలి. సుభాష్ పాలేకర్ వంటి వ్యవసాయ నిపుణులు చాన్నాళ్లుగా ప్రకృతి వ్యవసాయం గురించి చెబుతున్నారు. పాలకులెవరూ పట్టించుకోలేదు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనూ చేపట్టలేదు. నీతి ఆయోగ్ ఇటీవలి కాలంలో ఈ విధానాన్ని నెత్తికెత్తుకుంది. రైతుకు వ్యవసాయం గిట్టుబాటు కాని ప్రస్తుత విధానం నుంచి మార్పు అనివార్యమని కేంద్రం గ్రహించడమూ దీనికి కారణమేమో? పైగా ఎరువులుక్రిమిసంహారకాల దిగుమతి ఆర్థిక భారం మోయలేకుండా ఉంది. ఇది కాక... ఆహారో త్పత్తిపంపిణి, వ్యావసాయికజీవవైవిధ్యం నుంచి మార్కెట్ వరకు మొత్తం వ్యవస్థను గుప్పిట్లో ఉంచుకునే క్రమంలో విధిగా ప్రత్యామ్నాయాల్ని ప్రతిపాదించాల్సిన స్థితి వచ్చింది. రైతుకు రెట్టింపు ఆదాయం చూపుతామన్న పాలకపక్ష హామీ, సమీప భవిష్యత్తులో నిజమయ్యే సూచనలు లేవు. ఈ పరిస్థితుల్లో ప్రకృతి వ్యవసాయమే రక్షగా కనిపించి ఉండవచ్చు! పైగా, ఈ పద్ధతితో పెట్టుబడి వ్యయం సగానికి తగ్గించగలిగితే, దాని మీద 1.5 రెట్లు అధికంగా కనీస మద్దతు ధర ప్రకటించడ మైనా, కాలక్రమంలో రెట్టింపు ఆదాయం చూపడమైనా సాధ్యపడవచ్చు! గతంతో పోలిస్తే, ప్రకృతి వ్యవసాయం స్థిరపడే సూచనలు ఇటీవల కనిపిస్తున్నాయి. ప్రధాని చెప్పినట్టు దేశంలోని చాలా ప్రాంతాల్లో లక్షలాది రైతులు నెమ్మదిగా ప్రకృతి వ్యవసాయంవైపు మళు తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 'జీరో బడ్జెట్ ప్రకృతి వ్యవసాయం' సత్ఫలితాలనిస్తోంది. దాని వెనుక ఎంతో కృషి ఉంది. అజిత్ ప్రేమ్‌జీ వంటి ట్రస్టుల ఆర్థిక ప్రోద్బలంతో మౌలిక సదుపాయాలు, శిక్షణ, అవగాహన, సాంకేతి కతసమన్వయాల చేదోడు రైతాంగానికి లభిస్తోంది. ఇప్పుడు సహజ వ్యవసాయం చేస్తున్న వారి కష్టనష్టాల్ని పరిశీలించి, ఇంకా ఎక్కడెక్కడ, ఏయే రూపాల్లో సహకారం అందిస్తే అది స్థిరపడటానికి ఆస్కారం ఉ ంటుందో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అధ్యయనం చేయాలి. 'ఇదింకా ధ్రువపడలేదు, శాస్త్రీయ ఆధారాల్లేవు, గణాంకాల్లేవు...' అనే తర్కం వీడి శాస్త్రవేత్తలు, వ్యవసాయ పరిశోధనా కేంద్రాలు, ప్రభుత్వ విభాగాలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు తమ ఆలోచనా దోరణి మార్చు కోవాలి. వారిని దారిలోకి తీసుకురావడం ఇప్పుడు కేంద్రం ముందున్న సవాల్! కార్పొరేట్ పెత్తనం నుంచి విత్తనం తిరిగి రైతు చేతికి రావాలి. పెట్టుబడి వ్యయం తగ్గి రైతుకు ఆత్మహత్యల దుస్థితి తప్పాలి. రసాయనాల పీడ వీడి భూసారం తిరిగి పుంజుకోవాలి. గాంధీజీ కలలు కన్న సహజ వ్యవసాయ స్వావలంబన ద్వారా గ్రామ స్వరాజ్యం పరిఢవిల్లాలి. వాతావరణ మార్పు సంక్షోభానికి సమాధానంగా 'తిరిగి మూలాలకు' మళ్లే ప్రక్రియ, మరేదేశం కన్నా కూడ మనమే వేగంగా సాధించగలమని ప్రపంచానికి చాటి చెప్పాలి. అందుకు ఇదే మంచి తరుణం!


# ద్విజాతి సిద్ధాంతం సజీవం!




1971 డిసెంబర్‌లో బంగ్లాదేశ్ ఆవిర్భావం భారత ఉపఖండాన్ని మత ప్రాతిపదికన చీల్చివేసిన ద్విజాతి సిద్ధాంతం నిరాధారమైనదిగా నిరూపించింది. అర్ధశతాబ్ది అనంతరం ఆ సిద్ధాంతం మరోవిధంగా ప్రభవిల్లుతోంది. హిందువులు, ముస్లింలు రెండు వేర్వేరు జాతులవారన్న వాదనను మొదటిలోనే తిరస్కరించిన భారత్‌లోనే 'ద్విజాతి' భావన మళ్ళీ బలపడుతోంది. ఒక రాజ్యం అంతరించి ఒక జాతి ఆవిర్భవించింది. యాభై ఏళ్ళ క్రితం డిసెంబర్ శీత వేళ సంభవించిన చరిత్రాత్మక పరిణామమిది. తూర్పు పాకిస్థాన్ మరణాన్ని, బంగ్లాదేశ్ జననాన్ని నేను ప్రస్తావిస్తున్నాను. ప్రవాసంలో ఉన్న బంగ్లా స్వాతంత్ర్య సమరయోధులు 1971 ఏప్రిల్‌లోనే 'బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం'ను ఏర్పాటు చేశారు. 1971 డిసెంబర్ 6న ఆ ప్రభుత్వాన్ని భారత్ లాంఛనంగా గుర్తించింది. తూర్పు పాకిస్థాన్‌లో జనరల్ నియాజీ నాయకత్వంలోని పాకిస్థాన్ సేనలు 1971 డిసెంబర్ 16న భారత సైన్యానికి లొంగిపోయాయి. కొద్ది వారాల అనంతరం పాకిస్థాన్‌లో జైలు నుంచి విడుదలయిన షేక్ ముజిబుర్ రహమాన్ ఢాకాకు తిరిగివచ్చి స్వతంత్ర బంగ్లాదేశ్ నాయకత్వ బాధ్యతలు చేపట్టారు. బంగ్లాదేశ్ పుట్టుకను భారతీయులు మూడు దృక్కోణాలలో హర్షించారు. ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ధైర్యం, దార్శనికత, వివేకం, రాజనీతిజ్ఞతకు అమోఘమైన విజయంగా ఆమె రాజకీయ మద్దతుదారులు భావించారు. 1962లో చైనా చేతుల్లో భారత్‌కు ఎదురైన అవమానకరమైన, బాధాకరమైన పరాజయ స్మృతులను పాకిస్థాన్‌పై విజయం తుడిచి పెట్టిందని జాతీయవాదులు భావించారు. ఈ ఇరు బృందాలకు భిన్నంగా మరికొందరు బంగ్లాదేశ్ జననం భారత్‌కు సైద్ధాంతిక, నైతిక విజయంగా భావించారు. పాకిస్థాన్ సంస్థాపకుడు మహమ్మద్ అలీ జిన్నా ప్రవచించిన ద్విజాతి సిద్ధాంతానికి అంతిమ తిరస్కారమే బంగ్లాదేశ్ ఆవిర్భావమని ఈ మూడో దృక్పథంతో ఆలోచించిన భారతీయులు విశ్వసించారు. 1947లో దేశ విభజన అనివార్యమన్న విషయం అవగతమైన తరువాత గాంధీ, నెహ్రూ భారత్ ఎట్టి పరిస్థితులలోనూ లౌకిక దేశంగా ఉండి తీరాలని సంకల్పించారు. కొత్తగా ప్రభవించనున్న దేశంలో మైనారిటీలకు ఏమి సంభవించినప్పటికీ భారత్‌లో మతపరమైన మైనారిటీలకు సంపూర్ణ పౌరసత్వ హక్కులు కల్పించాలని వారు నిర్ణయించారు. మతాలకు అతీతంగా రాజ్యవ్యవస్థ వ్యవహరించాలని వారిరువురూ నిర్దేశించారు. హిందువులు, ముస్లింలు వేర్వేరు జాతుల వారని, ఆ ఇరువర్గాలూ శాంతిసామరస్యాలతో సహజీవనం చెయ్యలేరన్న జిన్నా వాదనను భారత్ గణతంత్ర రాజ్యం ఎటువంటి మినహాయింపులు లేకుండా తిరస్కరించింది. 1971 నాటి విజయాన్ని ఈ మూడో దృక్కోణంతో చూసిన భారతీయులను రాజ్యాంగ విహిత దేశభక్తులు అందాం. వీరు గాంధీ, నెహ్రూ భావజాల సంప్రదాయాలను కొనసాగించినవారు. పాకిస్థాన్ ఓటమి కంటే బహుళత్వం, లౌకికవాదం విజయంగా 1971ని పరిగణించాలనేది వీరి నిశ్చిత విశ్వాసం. జిన్నా, ఆయన నాయకత్వంలోని ముస్లింలీగ్ విశ్వాసాలకు విరుద్ధంగా పశ్చిమ, తూర్పు పాకిస్థాన్‌లను సమైక్యంగా ఉంచడంలో ఇస్లాం విఫలమయింది. మతం అనేది జాతికి ప్రాతిపదిక కాదనే సత్యాన్ని బంగ్లాదేశ్ ఆవిర్భావం రుజువు చేసింది. బెంగాలీ అస్తిత్వానికి ప్రాధాన్యమిచ్చిన బంగ్లాదేశ్ వ్యవస్థాపకులు మత ప్రాతిపదికన పౌరుల పట్ల వివక్ష చూపకూడదని నిర్ణయించారు. దేశ విభజన అనంతరం తూర్పు పాకిస్థాన్‌లోని హిందువులు వేధింపులకు గురయిన మాట నిజమే. భారత్‌కు వలసలు పెరగడంతో బంగ్లాలో హిందువుల సంఖ్య క్రమంగా తగ్గిపోయింది. 1971లో తూర్పు పాకిస్థాన్ జనాభాలో హిందువులు పది శాతం కంటే ఎక్కువగా ఉండేవారు (అదేకాలంలో పశ్చిమ పాకిస్థాన్‌లో హిందువులు 2 శాతం కంటే తక్కువగా ఉండేవారు) పశ్చిమ పాక్‌లో వలే కాకుండా తూర్పు పాకిస్థాన్ ప్రజాజీవితంలో హిందువులు ప్రభావశీలమైన పాత్ర నిర్వహిస్తుండేవారు. బంగ్లా విముక్తి పోరులో చాలామంది హిందువులు కీలక పాత్ర వహించారు. సైనిక కమాండర్లు జీవన్ కనాయి దాస్, చిత్తరంజ్ దత్తా, ప్రముఖ కమ్యూనిస్టు మోనీ సింగ్ మొదలైన వారిని ఆ సందర్భంగా ప్రస్తావించి తీరాలి. బంగ్లాదేశ్ మొదటి రాజ్యాంగాన్ని న్యాయకోవిదుడు కమాల్ హొస్సేన్ రూపొందించారు. 1972లో అమలులోకి వచ్చిన ఈ రాజ్యాంగం లౌకికవాదాన్ని ఔదల దాల్చింది. మతాలకు అతీతంగా దేశపౌరులు అందరికీ సమాన హక్కులు కల్పించింది. ఇస్లాంకు ప్రత్యేక స్థానం కల్పించలేదు. 1975లో ముజిబుర్ రహమాన్ హత్యానంతరం బంగ్లాదేశ్ ప్రజా జీవనంలో ఇస్లామిక్ ప్రభావాలు ఉధృతమయ్యాయి. జనరల్ ఎర్షాద్ నేతృత్వంలోని సైనిక ప్రభుత్వం ఆ ధోరణులను అన్ని విధాల ప్రోత్సహించింది. 1986లో రాజ్యాంగాన్ని సవరించి ఇస్లాంను బంగ్లాదేశ్ అధికారిక మతంగా ప్రకటించారు. అవామీలీగ్ అధికారంలోకి వచ్చిన తరువాత కమాల్ హొస్సేన్ రూపొందించిన తొలి రాజ్యాంగాన్ని పునరుద్ధరించాలని పాలకపక్షం నాయకులు నిర్ణయించారు. అయితే అటువంటి మార్పును వారు తీసుకురాలేక పోయారు. బంగ్లాదేశ్ ఆవిర్భవించింది మొదలు సామాజిక, ఆర్థిక రంగాలలో గణనీయమైన పురోగతి సాధించింది. స్థూల దేశీయోత్పత్తిలో తయారీరంగం వాటా మన దేశంలో కంటే మెరుగ్గా ఉంది. కార్మికశ్రేణుల్లో మహిళల శాతమూ ఎక్కువే. గత ఆర్థికసంవత్సరంలో బంగ్లాదేశ్ పౌరుల తలసరి ఆదాయం భారతీయుల తలసరి ఆదాయం కంటే ఎక్కువగా ఉంది. అయితే రాజకీయ, ధార్మిక రంగాలలో పరిస్థితులు దేశ వ్యవస్థాపకుల ఆదర్శాలకు అనుగుణంగా లేవు. మైనారిటీలు అభద్రతాభావంతో బతుకుతున్నారు. రచయితలు, మేధావులపై దాడులు పెచ్చరిల్లిపోతున్నాయి. సరే, ఇప్పుడు సహనం, బహుళత్వం విశిష్టతల గురించి బంగ్లాదేశీయులకు బోధించగల నైతిక అర్హత భారతీయులకు ఉందా? 1971 నాటికి, ఇప్పటికీ మన రాజకీయ, సామాజిక రంగాలలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. 2014 మేలో అధికారంలోకి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఆయన నాయకత్వంలోని భారతీయ జనతాపార్టీ హిందూ మెజారిటీవాద ఎజెండా అమలుకు అగ్ర ప్రాధాన్యమిస్తున్నాయి. 2015 సెప్టెంబర్‌లో అఖ్లక్ బహిరంగ ఊచకోత నుంచి 2021 డిసెంబర్‌లో కర్ణాటకలో క్రైస్తవులకు వ్యతిరేకంగా జరిగిన హింసాకాండ దాకా మోదీ ప్రభుత్వ పాలనాచరిత్ర అంత దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో మైనారిటీలపై మళ్ళీ మళ్ళీ దాడులు జరగడమే కదా? తమ దేశంలో హిందువులపై దాడులను బంగ్లా ప్రధాని షేక్ హసీనా నిర్ద్వంద్వంగా ఖండించారు. మరి మన ప్రధానమంత్రి తన దేశంలోని మైనారిటీలపై దాడుల పట్ల ఎందుకు మౌనం వహిస్తున్నారు! 2019 మేలో అమిత్ షా కేంద్ర హోం మంత్రి అయిన తరువాత ముస్లింలపై అపనిందలు మోపడం, వారిని అవమానాలకు లోనుచేయడం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలలో ప్రధానాంశాలుగా ఉంటున్నాయి. ముస్లింలు అత్యధిక సంఖ్యలో ఉన్న ఏకైక రాష్ట్రం జమ్మూ-కశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తి రద్దుచేయడం, జాతీయ పౌరపట్టిక రూపకల్పనకు ప్రతిపాదన, పౌరసత్వ చట్టం సవరణ మొదలైనవి అందుకు నిదర్శనాలు. ముస్లింల పట్ల ప్రస్తుత పాలకుల వివక్షకు అవి పూర్తిగా అద్దం పడుతున్నాయి. పౌరసత్వ చట్ట సవరణను కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమర్థించారు. అలాగే జాతీయ పౌరపట్టిక రూపకల్పన విషయంలో ఆయన దృఢసంకల్పం చూపుతున్నారు. బంగ్లాదేశ్ ఒక 'చెదపురుగుల జాతి' అని ఆయన ఒక సందర్భంలో దుయ్యబట్టారు. ఇది చాలా అనాగరికమైన అభివర్ణన. సహజంగానే బంగ్లాదేశ్ మేధావులు అమిత్ షా వ్యాఖ్యను తీవ్రంగా ఖండించారు. 'ముస్లింలను లక్ష్యంగా చేసుకుని అమిత్ షా తీసుకుంటున్న నిర్ణయాలు, చేపడుతున్న చర్యలు బంగ్లాదేశ్‌లోని మైనారిటీల విషయంలో తీవ్ర పర్యవసానాలకు దారి తీస్తాయని' ఢాకా విశ్వవిద్యాలయ చరిత్ర ఆచార్యుడు కమాల్ 2019 అక్టోబర్‌లోనే హెచ్చరించారు. బంగ్లాలోని కొంత మంది మౌలానాలు తమ ప్రసంగాలలో కశ్మీర్, జాతీయ పౌరపట్టిక గురించి తరచు ప్రస్తావిస్తూ భారత్‌లో ముస్లింల హక్కులపై దాడి జరిగితే అందుకు ప్రతిగా బంగ్లాలో హిందువులు తమ హక్కులను కోల్పోతారని స్పష్టం చేస్తున్నారని కూడా ప్రొఫెసర్ కమాల్ అన్నారు. వివిధ మతాలకు చెందిన చాందసవాదులు పరస్పరం రెచ్చగొట్టుకోవడం పరిపాటి. అమిత్ షా ఈ విషయంలో మరింత ప్రమాదకరంగా వ్యవహరిస్తున్నారు. గత ఏప్రిల్‌లో జరిగిన బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో, బంగ్లాదేశ్ తన పౌరులకు ఆహారాన్ని సమకూర్చలేకపోతోందని వ్యాఖ్యానించారు. ఇందుకు బంగ్లా విదేశాంగ మంత్రి ప్రతిస్పందిస్తూ అమిత్ షాకు తీవ్రంగా చివాట్లు పెట్టారు. బెంగాల్‌లో ఎన్నికల పోటీని హిందూ-ముస్లిం వ్యవహారంగా చిత్రించేందుకు అమిత్ షా ప్రయత్నించారు. బెంగాల్ ఓటర్లు ఆయన వైఖరిని తిరస్కరించి మమతకు మళ్ళీ అధికారం ఇచ్చారు. అయినా కేంద్ర హోంమంత్రి తన వైఖరిని మార్చుకోకుండా త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న ఉత్తరప్రదేశ్‌లో హిందువులలో అభద్రతా భావాన్ని నెలకొల్పడానికి ప్రయత్నిస్తున్నారు. భారతీయ ముస్లింలు భద్రత, గౌరవంతో జీవించేందుకు వారికి ఒక ప్రత్యేక దేశం అవసరమని 1940లలో జిన్నా వాదించారు. ముస్లింలపై హిందువులు తమ ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రాబల్యాన్ని ఎడతెగకుండా ప్రకటించాలని 2020లలో నరేంద్ర మోదీ, అమిత్ షా విశ్వసిస్తున్నారు. ఇది, గాంధీ, నెహ్రూ సంప్రదాయాలకు పూర్తిగా విరుద్ధమైనది. 1971 డిసెంబర్‌లో బంగ్లాదేశ్ ఆవిర్భావం భారత ఉపఖండాన్ని మత ప్రాతిపదికన చీల్చివేసిన ద్విజాతి సిద్ధాంతం నిరాధారమైనదిగా నిరూపించింది. అర్ధశతాబ్ది అనంతరం ఆ సిద్ధాంతం మరో విధంగా ప్రభవిల్లుతోంది. హిందువులు, ముస్లింలు రెండు వేర్వేరు జాతుల వారన్న వాదనను మొదటిలోనే తిరస్కరించిన భారత్‌లోనే 'ద్విజాతి' భావన మళ్ళీ బలపడుతోంది. మన వర్తమాన చరిత్ర క్రూరవైరుద్ధ్యాలలో ఇదొకటి!

## వెన్నెల కురియని లోగిలి

అమృతం కురిసిన రాత్రి
వెన్నెల రాలేదు
వెలుతురు కురవలేదు
మా బతుకు నంటిన చీకటి పోనూ లేదు
భూమి నడుగు ఆకాశమే గొడుగు
కాలే కడుపులు మాడే పేగులు
బతుకు నిత్య యుద్ధంలో
కాయ కష్టపు మొండి చేతులు
అర్ధ నగ దేహాన్ని కప్పుకోవడానికి
ఆత్మాభిమానాన్ని చుట్టుకోడానికి చాలవు
మరి దోసిళ్లతో అమృతం ఎలా తాగము?
వెన్నెల పారి ఉండొచ్చు




అమృతం కురిసిఉండొచ్చు
ఆధునిక నగరాలపై అద్దాల భవంతుల్లో
రాణుల రస భంగిమల్లో
నయా రాజుల కుర్చీలో
అర్ధరాత్రి స్వాతంత్ర్యములా
కొందరి చేతుల్లోనే ...

## విద్యార్థి

చదువు కోరుకొనే వాడు
నడత నేర్చుకొనేవాడు
సలహాలు పొంది తాను
సంస్కారం నేర్చువాడు

సాధనలు చేయువాడు
జవాబులు నేర్చువాడు
శిక్షనూ పొంది తాను
శిక్షణను పొందువాడు

కలలనూ కనేవాడు
సాకారం చేయువాడు
కష్టాలను ఎదిరించీ



ఫలితమును పొందుతాడు

క్రమశిక్షణ నేర్చువాడు
వినయంతో ఉండువాడు
చదువే కర్తవ్యంగా
మునుముందుకు సాగువాడు



## ఆకృతి షోరూం ప్రారంభోత్సవంలో పాల్గొన్న నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు

నరసరావుపేట. ప్రజాపాలన :నరసరావుపేట పట్టణంలో స్థానిక హెచ్ డి ఎఫ్ సి బ్యాంక్ నందు ఆకృతి వస్త్ర షోరూం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసరావుపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్-ఛార్జ్ డా.చదలవాడ అరవింద బాబు.ఈ సందర్భంగా డా.చదలవాడ షోరూమ్ యాజమాన్యానికి దుశ్శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. డా.చదలవాడ వెంట పార్లమెంట్ వాణిజ్య విభాగ అధ్యక్షులు మాజేటి వెంకటేష్,నరసరావుపేట సీనియర్ నాయకులు మన్నన్ షరీఫ్,పులిమి రామిరెడ్డి,డా.లక్కిరెడ్డి వేంకటేశ్వర్ రెడ్డి, కొల్లి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

# క్రీడల ద్వారా మానసిక ఒత్తిడిని జయించవచ్చు

## ఏపీ సీఎం కప్ ప్రారంభోత్సవంలో శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి








నరసరావుపేట. ప్రజాపాలన :కోటప్పకొండ జెడ్పీ హై స్కూల్లో ఏపీ సీఎం కప్ 2021-2022 ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. శాసనసభ్యులు డాక్టర్ గోపి రెడ్డి శ్రీనివాసరెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నియోజకవర్గ స్థాయిలో బాలురు-బాలికల విభాగాల్లో ఈ పోటీలు నిర్వహించు చున్నారు.పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ ఆటల పోటీలను శాసనసభ్యులు రిబన్ కట్ చేసి ప్రారంభించారు. వాలిబాల్ సర్వీస్ చేసి అందరిని ఆకట్టుకున్నారు. బాలికల విభాగంలో కబ్డి పోటీలను ప్రారంభించారు. నాడు నేడు ద్వారా రూ.68 లక్షలతో పాఠశాలను బాగుచేసుకున్నామని తెలిపారు. పాఠశాలకు కాంపౌండ్ వాల్, గేట్, మంచినీరు, వేదికను ఏర్పాటుచేసుకుని పాఠశాల రూపురేఖలనే మార్చివేసామని తెలిపారు. పాఠశాల విధ్యలో ఇవాళ ఏపీ నంబర్ వన్ గా నిలిచిందంటే దానికి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముందు చూపే కారణమని ప్రశంసించారు. ప్రతి విద్యార్థికి వేనవమావులా చదువుకోవడానికి అన్ని రకాల ప్రోత్సహకాలు అందిస్తున్నారని వివరించారులి. ప్రతి విద్యార్థికి ఆటలు చాలా ముఖ్యం అన్నారు. కార్పొరేట్ సంస్థల్లో చదువుకునే విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనై ఆత్మహత్య చేసుకుంటున్నారని అన్నారు. మానసిక ఒత్తిడిని జయించడానికి క్రీడలు దోహదపడతాయని అన్నారు. క్రిడల ద్వారా టీం స్పిరిట్ పెరుగుతుందని అది భవిష్యత్తులో కూడా ఉపయోగపడుతుందన్నారు. క్రీడల్లో బాగా రాణిస్తే ఉద్యోగాల్లో అవకాశాలు కూడా మెండుగా ఉంటాయని తెలిపారులి. నియోజకవర్గ స్థాయిలో జరుగుతున్న ఈ పోటీల్లో విద్యార్థులంతా బాగా రాణించి రాష్ట్ర స్థాయిలో పతకాలు పొందాలని ఆకాంకించారు. అలా రాష్ట్ర స్థాయిలో సత్తా చాటిన వారికి ప్రోత్సాహాకాలు అందించడమే కాకుండా.. సత్కారించి వారిని మరింత ముందుకు తీసుకెళ్తామని హామీ ఇచ్చారులి. కార్యక్రమంలో నరసరావుపేట ఎంపీపీ మూరబోయిన శ్రీను , జెడ్పీటీసీ చిట్టిబాబు , రొంపిచర్ల జెడ్పీటీసీ చిట్టిబాబు , కొటప్పకొండ సర్పంచ్ నాగిరెడ్డి , ఇన్ ఛార్జ్ ఎండీవో శ్రీనివాసరావు, పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ దాసరి శ్రీను , పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## భవానిపురం పోలీసు స్టేషన్ నూతన భవనాన్ని సందర్శించిన పోలీసు కమిషనర్ కాంతి రాణా తాతా



విజయవాడ,ప్రజాపాలన ప్రతినిధి య డిసెంబరు 18 : పోలీసు కమిషనర్ గా భాధ్యతలు చేపట్టిన కాంతి రాణా తాతా శనివారం మధ్యాహ్నం భావానిపురం పోలీసు స్టేషన్ నూతన భవనం ని సందర్శించారు. సుమారు రెండు కోట్లు ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం గతనెల 30 న ప్రారంభిచిన విషయం తెల్సిందే. ఐతే నగర సి పి గా భాధ్యతలు చేపట్టిన కాంతి రాణా తాతా తొలిసారిగా ఈ భవనాన్ని సందర్శించారు.భవనం లో అన్ని విభాగాలను సందర్శించారు స్టేషన్లో ఏ రూమ్ ఎవ్వరికీ కేటాయించారో సి పి కి స్థానిక సి ఐ జే మురలీకృష్ణ వివరించారు. విధినిర్వహణలో చాలా అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు,బాధితులకు పోలీసులు భరోసా ఇవ్వాలని,విధులు బాధ్యతగా నిర్వహించాలని ఆదేశించారు. కాగా ఈ నెల లో జరగనున్న భవానీ దీక్షలు విరమణ ఏర్పాట్లు,రోడ్లు పరిస్థితి విషయంపై ఆయన ఆరా తీశారు.భావానిపురం వైపు రోడ్లు బాగానే ఉన్నాయని వెస్ట్ జోన్ ఏ సి పి డాక్టరు కే హనుమంతరావు సమాధానం చెప్పారు. కాకుంటే చిట్టినగర్ ప్రాంతంలో రోడ్డు పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని ఆయన తెలిపారు.ఈ పర్యటనలో సి పి కాంతి రాణా తాతా తో పాటుగా వెస్టజోన్ డి సి పి బాబూరావు,ఏ సి పి డాక్టర్ కే హనుమంతరావు లు వున్నారు.

# పశువులను యజమానులు కట్టడిచేయాలి



నరసాపురం, డిసెంబర్ 18 (ప్రజాపాలన ప్రతినిధి) : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం పట్టణానికి చెందిన ఆవులు మరియు పందుల పెంపకదారులతో మునిసిపల్ చైర్ పర్సన్ బర్రి శ్రీ వెంకటరమణ, మునిసిపల్ కమిషనర్ పి.ఎం సత్యవేణి, పట్టణ సబ్ ఇన్స్పెక్టర్ సుధాకరరెడ్డి లు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ పట్టణములో పందులు మరియు ఆవుల పెంపకందారులు వాటిని రోడ్లపై వదిలివేయడంతో మార్కెట్ ప్రాంతం మరియు ఇండ్ల పరిసరాల ప్రాంతాలలో అవి విచ్చలవిడిగా సంచరిస్తున్నాయని వాటివలన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నట్లుగా ప్రజలనుండి మరియు కౌన్సిల్ సభ్యులనుండి అనేక ఫిర్యాదులు వస్తున్నట్లుగా తెలిపారు. ఇకపై పశువులు, పందులను వాటి పెంపకందారులు తమయొక్క వ్యక్తిగత స్థలాలలో కొద్ది సంఖ్యలో మాత్రమే పెంచుకోవాలని వారు సూచించారు. గతంలో రెండుసార్లు జరిగిన సమావేశాలలో ఈ విషయంపై పశువులు మరియు పందుల పెంపకం దారులను హెచ్చరించడం జరిగిందని కానీ సదరు పెంపకం దారులలో ఏ విధమైన మార్పు రానందున ఈ మూడవ సమావేశాన్ని చివరి సమావేశంగా భావించి పందులు మరియు ఆవులను రోడ్లపైన మరియు ఇండ్ల పరిసరాల ప్రాంతములలో విచ్చలవిడిగా తిరుగకుండా కట్టడి చేయాలని లేనియెడల తాము చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పెంపకందారులను వారు హెచ్చరించారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు శానిటేషన్ మరియు సెక్రటరీలు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యం పి లు అందరికి విజప్తి.. గుంటుపల్లి తులసి కుమారి




బాపట్ల ప్రజాపాలన బ్యూరో :ఆంధ్రుల ఆత్మాభిమానానికి ప్రతీక అయిన విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటుపరం చేయడాన్ని పార్లమెంట్ లో దయచేసి ప్రశ్నించండి! నిలదీయండి! ప్లకార్డుల ప్రదర్శన ద్వారా మీ నిరసనను తెలుపవలసిందిగా కోరుతున్నాం.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గుంటూరు జిల్లా, కార్యదర్శి గుంటుపల్లి తులసి కుమారి , సంయుక్త కార్యదర్శి నామన వెంకట శివన్నారాయణ , ఆరమల్ల సుజిత్, ఇమ్మడిశెట్టి మురళి కృష్ణ, గోగన ఆదిశేషు, ఈమని మణిదీప్, గొట్టిపాటి శ్రీకృష్ణ, షేక్ ఆసిఫ్, కొత్ర మణికంఠ, దేవిరెడ్డి శ్రీనివాసరావు,ఉస రామ్ ప్రసాద్ మరియు జనసైనికులు పాల్గొన్నారు.

## ప్రజా సేవకులు ప్రజల సేవకు ముందుండాలి: ప్రభుత్వ విప్ చిర్ల




కొత్తపేట (ప్రజాపాలన ప్రతినిధి) : ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజా సేవకులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు ముందుండాలని ప్రభుత్వ విప్ కొత్తపేట శాసనసభ్యుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు.కొత్తపేట మండల పరిషత్తు తొలి సమీక్ష సమావేశం మండల పరిషత్తు అధ్యక్షులు మార్గాన గంగాధర్ ఆధ్యక్షతన కొత్తపేట మండల పరిషత్తు కార్యాలయంలో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జగ్గిరెడ్డి నూతనంగా ఎన్నికైన జెడ్ పి టి సి,యమ్.పి.టి,సర్పంచ్ లను ముందుగా అభినందించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు మీపై ఎంతో నమ్మకంతో ఓట్లు వేసి అధికారాన్ని అందజేశారని అందుచేత ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేసి ప్రజలు మన్ననలు పొందాలని చూపించారు. ఈ సందర్భంగా యమ్.పి.డి.ఓ.మహేశ్వరరావు సభలో ప్రవేశ పెట్టిన బడ్జెట్, పలు తీర్మానాలను ఆమోదించారు.ఈ కార్యక్రమంలో జెడ్.పి.టి.సి.గూడపాటి రమాదేవి,వైస్.యమ్.పి.పి.బండారు మంగతాయారు కృష్ణమూర్తి.కొత్తపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లపల్లి దేవిడ్ రాజు,డి.సి.సి బి.డైరెక్టర్ బండారు రాజా,గంటి సర్పంచ్ సాగి బంగ్రాజు,తహశీల్దార్ జె.డి.కిషోర్ బాబు,యమ్.పి.టి.సి.లు,సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలు గుణింతాలు కూడా చెప్పలేకపోవడం ఏంటి?

### ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేసిన శాసనసభ్యులు డా గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి



నరసరావుపేట. ప్రజాపాలన :కోటప్పకొండలోని మండల పరిషత్ ప్రాథమిక ఆదర్శ పాఠశాలలో శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఒకే తరగతి గదిలో మూడో తరగతి వరకు పిల్లలను కూర్చోబెట్టి పాఠాలు బోధించడం సరికాదన్నారు. మూడో తరగతి విద్యార్థులు గుణింతాలు కూడ చెప్పలేకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. పిల్లలకు అక్షరాలు కూడా తెలియకపోవడం ఏంటి అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా సమయంలో చెప్పిన పాటలు అన్నీ పిల్లలు మర్చిపోయారు అని ఉపాధ్యాయులు చెప్పడం పట్ల మండిపడ్డారు. ఐదో తరగతి విద్యార్థులు టెక్స్ట్ బుక్ లోని పాఠ్యాంశాలను చదవ లేకపోవడం ఏంటి అని ప్రశ్నించారు.పిల్లల విద్యా ప్రమాణాల్లో రాజీపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పాఠశాల లోని విద్యార్థులకు యూనిఫాం లేకపోవడంతో పాటు, ఉపాధ్యాయులు పని తీరు కూడా బాగాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. నేడుకు, అమ్మ ఒడి పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లు వెచ్చిస్తుంటే ఉపాధ్యాయులు సరిగ్గా పాఠాలు కూడా చెప్పలేకపోవడం ఏంటని



నిలదీశారు.పాఠశాల విద్యావ్యవస్థ మారకపోతే చర్యలు తప్పవని తేల్చి చెప్పారు. ప్రాథమిక పాఠశాల దశలో విద్యార్థినీ విద్యార్థులు యాక్టివ్గా ఉంటారని జ్ఞాపకశక్తి బాగా ఉంటుందని అన్నారు. ఇలాంటి దశలో చెప్పే ప్రతి విషయం వారి మనసులో నాటుకుపోతుంది అన్నారు ఇప్పుడు నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో ఇబ్బంది పడతారని అన్నారు. ఉపాధ్యాయుల పని తీరులో మార్పు రాకుంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.ఆకస్మిక తనిఖీల్లో ఎమ్మెల్యే వెంట ఎంపీపీ మూగబోయిన శ్రీను , జెడ్పిటిసి చిట్టిబాబు , రొంపిచర్ల జెడ్పిటిసి పిల్లి ఓబుల్ రెడ్డి , కోటప్పకొండ సర్పంచ్ నాగిరెడ్డి, రవీందర్ రెడ్డి , పుల్లా రెడ్డి , జాన్ తదితరులు పాల్గొన్నారు.


## సచివాలయ సిబ్బంది బాధ్యతతో పనిచేయాలి..: ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి

కావలి, డిసెంబర్ 18, ప్రజాపాలన ప్రతినిధి:సచివాలయ సిబ్బంది బాధ్యతతో పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని 28 వ వార్డు లో గల 21వ సచివాలయాన్ని శనివారం వైకాపా వాళ్లు ఇన్చార్జులు కోన వెంకట్, శ్రీనివాసులు, నున్న మురళి, దావులూరి పవిత్రన్ తో కలిసి ఆయన సందర్శించారు.ఈ కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బంది ప్రధానమైన సమస్యలు డ్రైనేజీలు, రోడ్లు,వీధిదీపాలు మరియు పలుసమస్యలు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకురావడం జరిగింది. వెంటనే స్పందించి %మీూ% కావలి మున్సిపల్ కమిషనర్ శివ రెడ్డి ని వెంటనే పనులు మొదలుపెట్టాలిని %మీూ% ఆదేశించారు.తదుపరి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయో లేదో సచివాలయ స్టాఫ్ అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైయస్ ఆర్ సీపీ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కనమర్లపూడి నారాయణ , వైయస్ ఆర్ సీపీ నాయకులు జెనిగిర్ల మహేంద్ర యాదవ్ , మాజీ వార్డ్ కౌన్సిలర్లు గంధం ప్రసన్న ఆంజనేయులు,కుందుర్తి శ్రీనివాసలు,కుందుర్తి కామయ్య , మరియు తిరువీధి ప్రసాద్ ,వార్డ్ ఇంచార్జి లు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల మధ్య శ్రీరామరాజు జన్మదిన వేడుకలు

కావలి డిశంబర్ 18 ప్రజాపాలన ప్రతినిధి :శ్రీరామరాజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పేర్నపాటి శ్రీరామరాజు జన్మదిన వేడుకను శనివారం శివరామసుబ్బయ్య గిరిజన కాలనీలో ప్రియదర్శిని మహిళా మండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పిల్లలకు , వృద్దులకు బిస్కెట్స్, దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. ప్రియదర్శిని మహిళా మండలి అధ్యక్షురాలు షేక్ ఖాదర్ బి మాట్లాడుతూ సేవా తత్పరులు, స్నేహశీలి, నిరాడంబరులు పేర్నపాటి శ్రీరామరాజు అని ఎదుటి వ్యక్తి ఆపదలో ఉంటే వెంటనే స్పందించే గుణం కలిగినవారని, సమాజ శ్రేయస్సే కుటుంబ శ్రేయస్సు అని భావించే వ్యక్తి అని తెలియజేసారు. సేవా భావం కలిగిన శ్రీరామరాజు పుట్టిన రోజును ఇలా గిరిజన కాలనీలో జరుపుకోవడం సంతోషంగా ఉన్నదని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రపంచ మానవ హక్కుల అవగాహనా సంఘం నెల్లూరు జిల్లా చైర్మన్ మొహమ్మద్ అబ్దుల్ అలీమ్, హ్యాపీ స్వచంద సంస్థ అధ్యకులు సయ్యద్ ఘని భాష , గుడ్ మెన్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు సోమిసెట్టి బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న సంపూర్ణ గృహ హక్కు లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ పై శిక్షణ



ఆత్రేయపురం (ప్రజాపాలన ప్రతినిధి) : ఆత్రేయపురం మండల తాహశిల్దార్ కార్యాలయం లో తాహశిల్దార్ ఎం రామకృష్ణ ,ఎంపీడీఓ నాతి బుజ్జి మండలం లోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు మరియు డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు.జగనన్న సంపూర్ణ గృహహక్కు లబ్ధిదారుల రిజిస్ట్రేషన్ పై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా రిజిస్ట్రేషన్ విధానం పై, ఆ ప్రక్రియలో భాగంగా కార్యదర్శులు, వీఆర్వోలు మరియు డిజిటల్ అసిస్టెంట్లు వారి లాగిన్ల ద్వారా చేయాల్సిన విధులపై శిక్షణ ఇవ్వడం జరిగింది.ఈ నెల 22 మరియు 23 తారీఖులలో కొత్తపేట శాసనసభ్యుల ద్వారా ఈ రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశం లో , వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## సేవా తత్పరునికి సన్మానం:షేక్ నూర్జహాన్



బాపట్ల ప్రజాపాలన బ్యూరో : గుంటూరు జిల్లా కర్లపాలెం మండలం కోత్తనందయాపాలెం గ్రామ పంచాయతీ వార్డు సభ్యురాలు షేక్ నూర్జహాన్ అధ్వర్యంలో లిడాక్టర్ బి. ఆర్ అంబేత్కర్ నేషనల్ ఫెలో షిప్ అవార్డ్లి గ్రహీత , గిరిజన నాయకుడు, ప్రముఖ న్యాయవాది తిరువీధుల శంకర ప్రసాద్ నిలి శాలువా, పుష్పగుచ్చలతో సన్మానించారు . బాపట్ల నియోజకవర్గం లోని నిరుపేదలకు ఉచితంగా ఎస్ టి కార్పొరేషన్ ద్వారా రిక్షాలు కోవిడ్ -19 లాక్ డౌన్ సందర్భంలో ఎంతో మంది నిరుపేదలకు తన సొంత నిధులతో బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకుల పంపిణీ చేసిన ఘనత శంకర ప్రసాద్ కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ బాపట్ల పార్లమెంట్ మైనారిటీ మోర్చ అధ్యక్షులు షేక్ కరిముల్లా , డి. లక్ష్మి , డి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల ను పరిశీలించిన మంత్రులు, ప్రముఖులు

తణుకు,ప్రజాపాలన ప్రతినిధి : పశ్చిమగోదావరి జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటనను విజయవంతంగా నిర్వహించడంలో సమన్వయం చేసుకోవాలని జిల్లా ఇంఛార్జి, సమాచార శాఖ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని), ఉప ముఖ్యమంత్రి ఆళ్ల కాళీ కృష్ణ శ్రీనివాస్ (నాని) స్పష్టం చేశారు. శనివారం తణుకు జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రాంగణంలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల ను పరిశీలించి, ప్రజా ప్రతినిధులకు, స్థానిక సంస్థల నాయకులకు తగిన దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని మాట్లాడుతూ, తణుకు పట్టణంలో జగనన్న సంపూర్ణ గృహ హక్కు లబ్దిదారులకి రిజిస్ట్రేషన్ పత్రాలు అందించే కార్యక్రమాన్ని



పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని కోరారు. ఇందుకోసం స్థానిక ప్రజా ప్రతినిధులు టీమ్ ల కింద ఏర్పడి బహిరంగ సభకు వచ్చే ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చూసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపేందుకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చేందుకు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారని ఆయన అన్నారు. దేశంలో ఎక్కడా జరగనటువంటి సంక్షేమ కార్యక్రమాలు రాష్ట్రంలో మన ముఖ్యమంత్రి చేపట్టారని ఆళ్ల నాని తెలిపారు. ఇప్పటికే దాదాపు అన్ని ఏర్పాట్లను పూర్తి చెయ్యడం జరిగిందని, శాసన సభ్యులు కారుమూరి నాగేశ్వరరావు ప్రత్యక్ష పర్యవేక్షణ ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. సభకు తరలి వచ్చే వారికి త్రాగునీరు, అల్పాహారం, భోజనం ఏర్పాట్ల ను పకడ్బందీగా అమలు చేయడం ముఖ్యమని పేర్కొన్నారు. సభ ప్రాంగణంలో ని వీఐపీ గ్యాలరీ, మీడియా గ్యాలరీ, ఫోటో ఎగ్జిబిషన్ స్టాల్స్ లని పేర్ని నానితో కలిసి పరిశీలించారు. జిల్లా ఇంఛార్జి మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) మాట్లాడుతూ, రాష్ట్ర చరిత్ర లో గతంలో ఏ ముఖ్యమంత్రి సాహసించని విధంగా 52 లక్షాల కుటుంబాలకు గతంలో ప్రభుత్వం మంజురూ చేసిన ఇళ్ల పై, స్థలాలుపై సంపూర్ణ హక్కు కల్పించే దిశగా ఓటీఎన్ పధకాన్ని అమలు చేయడం, ప్రతి పక్షాలకు కునుకు లేకుండా చేస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు పశ్చిమ గోదావరి జిల్లాలో నిర్వహించడాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయడానికి కార్యకర్తలు, ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఎంతో ఆతృతగా ఎదురు చూస్తున్నారన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపడితే ఓర్వలేక కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఎస్ కె ఎస్ మహిళా కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ప్రాంతాన్ని సందర్శించడం జరిగింది.

ఈ పర్యటన లో ప్రభుత్వ మీడియా సలహాదారు, శాసన మండలి సభ్యులు తలసిల రఘురాం, శాసన సభ్యులు కారుమూరి నాగేశ్వరరావు, జి. శ్రీనివాస్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే పాతపటి సర్రాజు, స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, తదితరులు హాజరయ్యారు.

## జగన్న గోరుముద్ద పరిశీలనచేసిన జెడ్పిటిసి సభ్యు రాలు వూట్ల నాగమణి



పెనుగంచిప్రోలు18డిసెంబర్ (ప్రజాపాలనప్రతినిధి) :అనిగడ్లపాడు గ్రామం లోని జెడ్ పి హెచ్ స్కూల్ లో "జగన్న గోరుముద్ద" కార్యక్రమాన్ని విద్యార్థినీ విద్యా ర్థులతో మమేకమై వారితో మధ్యాహ్న జగన్న భోజ నం పథకం లో భాగంగా అందిస్తున్న భోజనలను పరి శీలించి విద్యార్థినీ విద్యార్థులతో కలిసి భోజనం చేసి, స్కూల్ లోని సమస్యలను అడిగి తెలుసుకున్న పెను గంచిప్రోలు జెడ్పిటిసి సభ్యురాలు వూట్ల నాగమణి, పెనుగంచిప్రోలు ఎంపీపీ మార్కపుడి గాంధీ, గ్రామం సర్పంచ్ బి. జ్యోతి బ్రహ్మం,వారితోపాటు ఎంపీటీసీలు దోసపాటి స్వర్ణలత, పొందూరి.విజయలక్ష్మి,సొసైటీ అ ధ్యక్షులు పిడికిటి.కోటేశ్వరరావు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కవి రహీం సాహెబ్ తెలంగాణ రాష్ట్రంలో సన్మానం



పొన్నూరు డిసెంబర్19 (ప్రజా పాలన ప్రతినిధి) :తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీ శ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో హైదరాబాదులోని రవీంద్ర భారతిలో జాతీయ సాహితీ సదస్సు సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనం లో పొన్నూరు కు చెందిన ఆర్టీసీ కండక్టర్ ,కవి, గాయకుడు షేక్. రహీమ్ సాహెబ్ తన కవిత "అమ్మ నీకూ దండమే...అనే కవితా గానం ద్వారా సాహితీ కవులను రంజింపజేశారు . ఉభయరాష్ట్రాల నుంచి వచ్చిన దాదాపు 200 మంది కవుల సమక్షం లో ప్రశంసలు అందుకున్నారు. అనంతరం సన్మాన కార్యక్రమం లో శ్రీశ్రీ కళా వేదిక జాతీయ అధ్యక్షులు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ చైర్మన్ పుల్లంగోళ్ళశ్రీ లక్ష్మి , బోయి హైమవతి, భీమన్న లు శాలువా మోమెంటో ప్రశంసా పత్రం తో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళా వేదిక భువనగిరి శాఖ కార్యదర్శి కొంపల్లి నేతాజీ, జాతీయ మహిళా అధ్యక్షురాలు రామ వతి , చిట్టే లలిత , సినీ ప్రముఖులు మురళి నగరానికి చెందిన ప్రముఖ సాహితీవేత్తలు యువకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఆలయాల నిర్మాణమునకు టీటీడీ ఆర్థిక సాయం



పిట్టలవాని పాలెం(ప్రజాపాలన): గ్రామీణ ప్రాంతాలలో ఎస్సీ, ఎస్టీ, బిసి, మత్స్యకార కాలనీలలో నిర్మాణం చేపట్టబోవు ఆలయాలకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఆర్థికంగా రూ 10 లక్షల రూపాయలు వరకు ఆర్థిక సహకారం ఏర్పాటు చేయబడుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి జి.నరసింహమూర్తి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ ఆర్థిక సహకారంతో గ్రామీణ ప్రాంతాలలో మారుమూల కాలనీలలో కూడా శ్రీరామ మందిరం, వెంకటేశ్వర స్వామి వారి ఆలయము, శివాలయం, గ్రామ దేవతలు, మొదలగు హిందూ దేవతల ఆలయాల నిర్మాణాలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ మరియు తిరుమల తిరుపతి దేవస్థానం నుండి ఆర్థిక సహకారం 10 లక్షలు చొప్పున అందించబడుతుందని వీటికి సంబంధించి కావలసిన అప్లికేషన్ లు సమీపములో గల దేవాదాయ శాఖ కార్యనిర్వహణాధికారులు మరియు మండల ఎండోమెంట్ ఇన్చార్జిల వద్ద ధరఖాస్తు ఫారములు లభిస్తాయని చెప్పారు. పూర్తి వివరములకు గుంటూరు నాజ్ సెంటర్ లో కల దేవాదాయశాఖ సహాయ కమిషనర్ వారి కార్యాలయంలో సంప్రదించవచ్చునని సూచించారు. శనివారం పిట్టలవానిపాలెం మండల పరిధిలోని అన్ని గ్రామాలలో గ్రామ పెద్దలకు ఈ విషయాలు తెలుపగా గోకరాజునల్లిబోయినవారిపాలెం గ్రామం నుండి శ్రీ సత్యమ్మ తల్లి ఆలయ నిర్మాణం కొరకు గ్రామ సర్పంచ్ శ్రీ దబ్బకూటీ మాధవరావు అన్నం శ్రీనివాసరెడ్డి , పిట్టువారిపాలెం గ్రామములో శ్రీ రామ మందిర నిర్మాణం కొరకు పిట్టలవారిపాలెం మండల ఉపాధ్యక్షులు దెందుకూరి సీతారామరాజు, యేట్రి శ్రీ నివాసరెడ్డీ, ఖాజీపాలెం గౌడపాలెం శ్రీరామఆలయ నిర్మాణము కొరకు కూసం పూడి దేవేంద్ర రాజు, ఉప్పాల శ్రీనివాసరావులు దరఖాస్తులు అందజేశారని తెలియజేసారు.

## వ్యవసాయ శాఖ సిబ్బంది కి సామర్థ్యం పెంపు పై అవగాహన



పొన్నూరు డిసెంబర్18 (ప్రజాపాలన ప్రతినిధి) :పొన్నూరు వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని వి ఏ ఏ, వి హెచ్ ఏ, ఎంపీఈవో లకు శనివారం పొన్నూరు వ్యవసాయ శాఖ కార్యాలయంలో సామర్థ్యం పెంపు పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎడిఎ . సి హెచ్ తిరుమలదేవి పాల్గొని మాట్లాడుతూ స్టేట్స్ క్షేత్రస్థాయి క్షేత్రస్థాయి సిబ్బంది అందరూ ఖరీఫ్ సీజన్లో ధాన్యం పంట కొనుగోలుకు సంబంధించి వివరాలను ప్రతి రైతుకు వివరించాలని అలానే ధాన్యం కొనుగోలు గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా విక్రయించవచ్చు అని తెలియజేయాలని ఆమె సూచించారు. ఈ ఏడాది వరి ప్రభుత్వం మద్దతు గ్రేడ్ ఏ ధర రూ. 1960, సాధారణ రకం రూ. 1940 ప్రకటించిందన్నారు. 2021 బి22 పొలంబడి (రబీ) కి ప్రభుత్వం రాయితీపై ఇచ్చే జీవన ఎరువులు, రైజోబియం, ట్రైకోడెర్మా ,పి ఎస్ బి ,వి ఏ ఎం లను లబ్ధిదారులకు అందజేయాలని ఆమె సూచించారు. జాతీయ ఆహార భద్రతా పథకం పై నిర్ణయించిన 20 హెక్టార్ల విస్తీర్ణంలో లబ్ధిదారుల ను ఎంపిక చేసి 60 శాతం రాయితీపై జీవన ఎరువులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ అంశాలను తెలియజేశారు ఏవో. సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

## నాయిబ్రాహ్మణులకు జరిగిన అన్యాయంపై మా తడాఖా చూపిస్తాం. కొండ్రముట్ల నాగేశ్వరరావు



చిలకలూరిపేట:(ప్రజాపాలనప్రతినిధి)నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గీయులు రాజీకీయ భాగస్వామ్యానికై శాసన మండలిలో స్థానం కోసం దశాబ్దాల నుండి ఎదురు చూస్తున్నప్పటికీ కలగానే మిగిలిపోతుంది కానీ నాయిబ్రాహ్మణుల ఆశయం నెరవేరడం లేదని నందా యువసేన కోస్తాంధ్ర జిల్లా అధ్యక్షులు కొండ్రముట్ల నాగేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ సర్వజనులకు కులవృత్తులతో సేవలందిస్తూ సమాజ హితానికి పాటుబడుతున్న నాయి బ్రాహ్మణులను ప్రభుత్వాలు ఓటు బ్యాంకుగానే చూస్తున్నారు కానీ పదవుల విషయానికి వచ్చేసరికి ప్రక్కకు నేటిస్తున్నారని ప్రభుత్వాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సామాజిక వర్గీయులు అంతారాజకీయ పార్టీలను స్వాగతిస్తున్నాం... రాజకీయ నేతలను కీర్తిస్తున్నాం ఇచ్చిన హామీలను నేతల మాటలు సైతం నీటి మూటలు మిగిలిపోతున్నాయి తప్ప తమకున్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటు బ్యాంకు ప్రకారం మనకు రావాల్సిన పదవుల పంపకాలపై పోరాటానికి సిద్ధం అవుతామని ఈ సందర్భంగా నాయకులను హెచ్చరించారు. తమకు జరిగిన అన్యాయంపై రానున్న ఎన్నికల్లో తాడో.. పేడో తేల్చుకుంటామని మండిపడ్డారు. నాయి బ్రాహ్మణ సామాజిక వర్గీయులు అంతా ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని కొండ్రముట్ల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రభుత్వాలు తమ పై చూపిస్తున్న చిన్న చూపు పైనా మన తడాఖా చూపించి... మన గళాన్ని వినిపించాల్సిన అవసరం ఉందని నాయకులు సిద్ధం కావాలని అన్నారు.

# నండూరు లో కరోనా పరీక్షలు



పొన్నూరు డిసెంబర్ ప్రజా పాలన ప్రతినిధి :మండల పరిధి నండూరు గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణంలో పాంద్రపాడు పి. హెచ్.సి వైద్యశాల సిబ్బంది గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరికి కరోనా పరీక్షలు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని అలానే మాస్కు లు తప్పనిసరిగా వాడాలని సూచించారు. మొదటి డోసు వేయించుకొని రెండవ డోసు వేయించు కొనని వారు తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. గ్రామంలో వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి కరోనా పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పాంద్రపాడు వైద్య సిబ్బంది తో పాటు సచివాలయ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ ర్యాలీ తో ప్రమాణ స్వీకారం మందపల్లి ఎం.పి.టి.సి.సిద్దంశెట్టి వీర వెంకట సత్యనారాయణ



కొత్తపేట (ప్రజాపాలన ప్రతినిధి) : పంచాయితీ ఎన్నికలలో తెలుగు దేశం పార్టీ తరుపున పోటీ చేసి బారీ మెజారిటీ తో విజయం సాధించిన సిద్ధంశెట్టివీరవెంకటసత్యనారాణ మందపల్లి నుండి కొత్తపేట పంచాయితీ వరకూ అభిమానులు తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు మధ్య బైక్ ర్యాలీ నిర్వహించారు అనంతరం కొత్తపేట సర్పంచ్ బూసి జయలక్ష్మి భాస్కర్ రావు, వాడపాలెం సర్పంచ్ త్సామా ఆదినారాయణ (బాబు) కొవ్వేల నాగేశ్వరరావు, మందపల్లి మాజీ సర్పంచ్ ,కొల్లి వీరా స్వామి, పంచాయితీ అధికారుల మధ్య సాలువా కప్పి సన్మానించి పూల దండలు వేసి అభినందనలు తెలియజేశారు తర్వాత ఎంపిడిఓ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేసి మొదటి మీటింగులో పాల్గొన్నారు.

## అమానుల్లా కు ముస్లిం పెద్దలు సన్మానం



పొన్నూరు డిసెంబర్18 (ప్రజా పాలన ప్రతినిధి) :పొన్నూరు పట్టణానికి చెందిన ఎండి అమానుల్లా వాటర్ రిసోర్స్ డిపార్ట్మెంట్ లో ఎన్ టి పి ఏ గా 38 సంవత్సరాలు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దల ఆధ్వర్యంలో శనివారం ఎండి. అమానుల్లా ను ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. ఆయన సుదీర్ఘ జీవితాన్ని ముస్లిం సమాజానికి సేవ చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది కరీముల్లా, సయ్యద్ ఇస్మాయిల్ ,షేక్ నాగూర్ భాష ,షేక్ రషీద్, అబ్దుల్ కరీం, మొహమ్మద్, యాసిన్ జానీ, అబ్దుల్ కరీం, మొహిద్దిన్, అబ్దుల్ ఖదీర్ తో పాటు అంజుమన్ కోర్ కమిటీ సభ్యులు ఉస్మాన్ మేస్త్రి తదితరులు పాల్గొన్నారు.

# సీపియం సీనియర్ తోట రామారావు మృతి



కంచికచర్ల డిసెంబర్ 17(ప్రజాపాలనప్రతినిధి)కంచి క చర్ల కు చెందిన సీపియం సీనియర్ నాయకుడు తోట రామారావు (75) అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృ తి చెందారు. 1964 కు ముందు కమ్యూనిస్టు పార్టీ చీ లక ముందు నుండి పార్టీ లో క్రియాశీలక సభ్యుడుగా ఉన్నారు. కమ్యూనిస్టు పార్టీ చీలిక తర్వాత సిపియం పార్టీలో సభ్యత్వం తీసుకుని ఇప్పటి వరకు సభ్యుడు గా క్రియాశీలకంగా పని చేశారు. సిపియం సిద్ధాంతం ఇప్పటికే నేటి తరానికి నూరిపోసేవాడు. జాతీయ, అంతర్జాతీయ విషయాల్లో పార్టీ తీసుకునే నిర్ణయా లను ఎప్పటికప్పుడు తెలుసుకోవటంలో ముందుండే వాడు. 2012 వరకులారీ డ్రైవర్ గా, ఓనర్ గా జీవ నం సాగిస్తూ ,కుటుంబాన్ని పోషించాడు. పార్టీ ఇచ్చిన పిలులను విజయవంతం చేయటంలో క్రియాశీల పా త్ర పోషించేవారు. పార్టీ అగ్ర నాయకులు అట్లూరి శ్రీ మన్నారారణ, బి ఆర్ తులసీరావు, వి ఉమామహే శ్వరరావు లో సారధ్యంలో కంచికచర్లలో పార్టీ నిర్మా ణంలో క్రియాశీలకంగా పని చేశారు. 1995 నుండి 2002 వరకు ప్రజాశక్తి దినపత్రిక ఏజెంటుగా కంచికచ ర్ల లో పత్రిక నడిపారు. ఘుదాదిన్నర క్రితం కిడ్నీ లకు సంబంధించిన వ్యాధితో అనారోగ్యానికి గురయ్యారు. ఇటీవల కాలంలో చికిత్స చేయించుకున్నారు. ఏడా ది కాలంగా ఇంటి వద్దనే ఉంటున్నారు. శుక్రవారం రా త్రి మృతి చెందారు. తోట రామారావు కు భార్య, కు మార్తె, కుమార్డు ఉ న్నారు. తోట రామారావు మృతి ప ట్ల సిపియం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి ఉమా మహేశ్వర రావు, బి ఒర్ తులసీరావు, జిల్లా కార్యద ర్శి బి వి కృష్ణ, మహిళా సంఘం రాష్ట్ర నాయకురాలు యార్లగడ్డ జోయ, నాయకులు చనుమోలు సైదులు, సయ్యద్ ఖాశిం, కోడూరు పిచ్చేశ్వరరావు, వట్టికొండ పార్ధ సారధి, జి హరికృష్ణ రెడ్డి, షేక్ ఖాశిం తదితరులు సంతాపం తెలిపారు.

## మంజూరైన నిధులకు తగ్గట్లుగా కొత్తపేట: రావులపాలెం రహదారిని పునర్నించాలి



కొత్తపేట (ప్రజాపాలన ప్రతినిధి) : ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు పోరాట ఫలితంగా ఎట్టకేలకు కొత్తపేట - రావులపాలెం ప్రధాన రహదారికి మోక్షం లభించిందని. రూ. 8.20 కోట్ల నిధులు వ్యయంతో చేపట్టనున్న రహదారి పనులకు " టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్లు అగ్రిమెంటు అనంతరం పనులు చేపట్టాల్సి ఉందని అమలాపురం పార్లమెంట్ అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి అన్నారు.ఈ రోడ్డుకు ముందుగానే పనులు చేపట్టడం అభినందనీయం.. పెద్ద మొత్తంలో మంజూరైన నిధులుతో పటిష్టంగా రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. నిబంధనలకు అనుగుణంగా అధికారులు పనులను పర్యవేక్షించాలి.రెండున్నరేళ్ళు పోరాట ఫలితంగా లభించిన నిధులు సద్వినియోగం అయ్యేలా రోడ్డు నిర్మాణం జరగాలి. సొంత నిధులుతో రోడ్డు నిర్మాణం చేస్తున్నట్లుగా ప్రచారం చేసుకుంటున్న వారు ప్రస్తుతం జరుగుతున్న పనులు ఖరారైన టెండరులో భాగమో కాదో చెప్పాలన్నారు.సొంత నిధులంటూ ప్రభుత్వ నిధులను ఖర్చు చేస్తే అందుకనుగుణంగా అధికారులు రోడ్డు నాణ్యత పనులను పరిశీలించి పటిష్ట నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నామని బాబ్జి తెలిపారు.

## నిహాల్ అధినేత శ్రీనివాస్ ఆధ్వర్యంలో మానసిక వికలాంగులకు షట్టర్లు పంపిణీ



మధిర డిసెంబర్ 18 ప్రజా పాలన ప్రతినిధి మధిర నిహాల్ లేబరేటరీ అధినేత శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం డాక్టర్ వసంతమ్మ మానసిక వికలాంగుల కేంద్రంలో నివాసం ఉంటున్న మానసిక వికలాంగుల అందరికీ ఉన్ని షట్లర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలం దృష్టిలో పెట్టుకొని మానసిక వికలాంగులకు ఉన్ని షట్టర్లు అందించడం జరిగిందని ఆయన తెలిపారు.అదే కాకుండా మాధవ సేవే మానవ సేవ అంటూ పేదలకు సాయం చేస్తే మేలు జరుగుతుందని తెలిపారుఈ కార్యక్రమంలో సేవాసదన్ కోఆర్డినేటర్ కుమార్ పాల్గొన్నారు.

## మధిరలోసబ్ జైల్ ను సందర్శించిన జడ్జి



మధిర డిసెంబర్ 18 ప్రజా పాలన ప్రతినిది మధిర జూనియర్ సివిల్ జడ్జి మరియు మండల్ లీగల్ ఎయిడ్ చైర్మెన్ గౌరవ శ్రీ ధీరజ్ కుమార్ సబ్ జైల్ ను సందర్శించారు. జైల్లో ఉన్న ఖైదీలతో మాట్లాడారు. వాళ్ళ కేసు పురోగతి మరియు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖైదీలకు అందుతున్న ఆహార పదార్థాలు , వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. గౌరవ జడ్జీగారు ఖైదీలకు అందుతున్న వసతులపై సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ శ్రీ యన్ ప్రభాకర్ రెడ్డి తో పాటు కోర్టు సిబ్బంది , లీగల్ ఎయిడ్ అడ్వకేట్ రమేష్ , సతీష్ , పూర్ణ చందర్ రావు మరియు జైలు సిబ్బంది తదితులు పాల్గొన్నారు.

## సిద్ది నేను గూడెం సొసైటీలో దాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



మధిర18డిసెంబర్ ప్రజా పాలన ప్రతినిధి :సిద్దినేనిగూడెం సొసైటీ పరిధిలోని నాగవరప్పాడు గ్రామంలో ఈరోజు గ్రామ సర్పంచ్ మోరాబోయిన నాగమణి చేతుల మీదగా దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సొసైటీ చైర్మన్ కటికల సీతారామిరెడ్డి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక రైతు ఇబ్బంది పడకుండా పండించిన ధాన్యాన్ని గ్రామంలోనే అమ్ముకునే విధంగా కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయటం అయిందన్నారు. దళారుల ప్రమేయం లేకుండా రైతే నేరుగా ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు అమ్ముకోవచ్చని తెలిపారు. కొనుగోలు కేంద్రానికి నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొచ్చి రైతులు అధిక ధరలు పొందాలని తెలిపారు. చుట్టుపక్క గ్రామాల రైతులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో నాగవరప్పాడు ఎం పి టి సి రాజరాజేశ్వరి, సొసైటీ వైస్ ప్రెసిడెంట్ తాటి సురేష్, డైరెక్టర్ పుల్లారెడ్డి, సీఈఓ కృష్ణారెడ్డి , రైతులు పాల్గొన్నారు.

## వర్తక సంఘం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో అన్నగోవిందం




మధిర డిసెంబర్ 18 ప్రజాపాలన ప్రతినిధిమధిర మున్సిపాలిటీ పరిధిలో వర్తకసంఘంలో వెలసివున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అన్నదాతలు సహకారంతో వేముల లీలా కృష్ణ, శ్రీమతి శైలుష్, మోరి శెట్టి మురళీధర్, శ్రీమతి పద్మజ, జల్లా సాయి ప్ర వణి, షేక్ ఇంత్యస్అలీ జ్ఞాపకార్థం ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ.ఈ దేవాలయంలో ప్రతి శనివారం జరిగే అన్నదాన కార్యక్రమంలో మా వంతు మేము అన్నదానం అందించినందుకు అన్నం పరబ్రహ్మ స్వరూపం అని అన్నదానం చేయడం వల్ల వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు మాకు ఉంటాయని వారు తెలిపారు ఈ కార్యక్రమంలో కపిల వాయి జగన్ మోహన్ రావు, స్వామి సతీష్ పాల్గొన్నారు.

## నియోజకవర్గ సమస్యల పరిష్కారానికే “మీతో నేను”

**వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్**



వికారాబాద్ బ్యూరో 18 డిసెంబర్ ప్రజాపాలన : నియోజకవర్గంలో గల గ్రామాల అభివృద్ధికై నిరంతరం లి”మీతో నేను”లి కార్యక్రమంతో ప్రజాక్షేత్రంలోకి వస్తున్నానని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. శనివారం వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ లి”మీతో నేను”లి కార్యక్రమంలో భాగంగా మోమిన్ పేట్ మండల పరిధిలోని మొరంగపల్లి గ్రామంలోటిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దబ్బని వెంకట్ ఆధ్వర్యంలో సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ఉదయం 7 గంటల నుండి 10:30 గంటల వరకు పర్యటించారు. నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్ళినా అధికార యంత్రాంగంతో అత్యవసర సమస్యలను వెంటనే పరిష్కరిస్తున్నామని, దీర్ఘకాళిక సమస్యలకు ప్రణాళిక బద్దంగా శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. మొరంగపల్లి గ్రామంలో మిషన్ భగీరథ లీకేజీలతో నీరు కలిషితం కాకుండా ఇంటింటికి మంచి నీటి సరఫరా చేయాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. పంట పొలాల రైతులకు ట్రాన్స్ఫార్మర్ కావాలని కోరగా, విద్యుత్ అధికారులతో మాట్లాడి మంజూరు చేయించడం జరిగింది. ఇనుప స్తంభాలు వెంటనే తొలగించాలని, విద్యుత్ దీపాల కోసం థర్డ్ వైర్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలోని జిల్లాపరిషత్ పాఠశాల మరియు ప్రాథమిక పాఠశాలలను సందర్శించి, విద్యార్థులకు ఆంగ్ల వ్యాకరణం బోధించి విద్యార్థులతో ముచ్చటించారు.ఈ కార్యక్రమంలో జడ్పి వైస్ చైర్మన్ బైండ్ల విజయ్ కుమార్, మండల టిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు చీమల్దరి సర్పంచ్ నాసన్ పల్లి నర్సింహారెడ్డి, మోమిన్పేట్ పిఏసిఎస్ చైర్మన్ బండ విష్ణువర్ధన్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు కార్యకర్తలు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి క్రీడాకారులను అభినందించిన మాజీ ఎంపీపీ పొనుగోటి శ్రీనివాసరావు



వెల్గటూర్, డిసెంబర్ 18 (ప్రజాపాలన ప్రతినిధి). : వెల్గటూరు మండలంలోని ఎండ పల్లి గ్రామానికి చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రాస్ కంట్రీ పోటీలకు ఎంపికైన విద్యార్థులను రాష్ట్ర టిఆర్ఎస్ నాయకులు పొనుగోటి శ్రీనివాసరావు శనివారం అభినందించారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు అండర్ 18 బైకని శివమణి, అండర్ 20 సబ్బ మనీషా, సబ్బ వసంత, గూడా మేఘన, బొడ్డు తేజస్విని మెన్ చికటి నవీన్ కుమార్, ఈనెల 10 నా ఎండ పల్లి జరిగిన జిల్లా స్థాయి క్రా స్ కంట్రీ పోటిలలో మంచి ప్రతిభను కనబర్చిన రాష్ట స్థాయి పోటీలకు ఎంపికైన వీరు ఈనెల 27 నా కరీంనగర్ జిల్లాలో జరిగే 8 వ రాష్ట్ర స్థాయి క్రాస్ కంట్రీ పోటీలలో జగిత్యాల జిల్లా తరపున పాల్గొంటారని అథిటిక్స్ కోచ్ బైకా న్ కొమురయ్య శ్రీనివాస రావు కు వివరించారు. రాష్ట్ర జాతీయ స్థాయిలో మన జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారులను శ్రీనివాసరావు కోరారు. అదేవిధంగా క్రీడలకు మంచి పేరు గల గ్రామం ఎండపల్లి అని ఆయన అన్నారు. రాజరంపల్లి సర్పంచ్ గెల్లు శేఖర్, తెరాస మండల శాఖ అధ్యక్షులు సింహాచలం జగన్ కార్యదర్శి జూపాక కుమార్,కున మల్ల లింగయ్య, డాక్టర్ రామ స్వామి, కొప్పుల సురేష్, ముగాల సత్యం, చల్లూరి రామచంద్ర గౌడ్, కొంగర చంద్రారెడ్డి, పొన్నం తిరుపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం



ఎర్రుపాలెం డిసెంబర్ 18 ప్రజా పాలన ప్రతినిధి:ఇటీవల విడుదలైన ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం పరీక్ష ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బనిగండ్లపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రిన్సిపల్ రమణారెడ్డి చేతుల మీదగా బహుమతులను అందచేయడం జరిగింది. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని వీరిని ఆదర్శంగా తీసుకొని మిగతా విద్యార్థులు కూడా వచ్చే పరీక్షలలో మంచి ఫలితాలను సాధించాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొని విద్యార్థుల ప్రతిభను అభినందించారు.

## మాటూర్ విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల పంపిణీ



మధిర డిసెంబర్ 18 ప్రజా పాలన ప్రతినిధి మధిర మండలం మాటూరు గ్రామం ప్రాథమిక పాఠశాలలోజిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించడంలో భాగంగా మధిర కళాశాల వసతి గృహ సంక్షేమ అధికారి ఎడ్ల మల్లారెడ్డి చొరవతో మాటూర్ ఉన్నత పాఠశాలకు చెందిన 45 మంది ఎస్సీ విద్యార్థులకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీ సంక్రాంతి శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంక్రాంతి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపకార వేతనాల కొరకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అతి తక్కువ సమయంలో అందించిన రెవెన్యూ సిబ్బందికి, మీ సేవా సిబ్బంది కి బ్యాంక్ అకౌంట్ లో అందించిన బ్యాంకు సిబ్బందికి మాటూర్ పాఠశాల విద్యార్థులు, గ్రామస్తుల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వసతి గృహ సంక్షేమాధికారి ఎడ్ల మల్లారెడ్డి, సత్య సాయి మీ సేవా సిబ్బంది బొగ్గవరపు చైతన్య పాఠశాల ఉపాధ్యాయులు సంక్రాంతి శ్రీనివాసరావు, కొలగాని ప్రసాదరావు, కంచిపోగు ఆదాము, రెంటపల్లి భాగ్య శ్రీనివాసరావు, వేము రాములు, మహ్మద్ చాంద్ బేగం, గుంటుపల్లి రమాదేవి, వేములపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## నెహ్రు యువ కేంద్రం ఆధ్వర్యంలో టైలరింగ్ ఉచితంగా నేర్పించబడును



ఇబ్రహీంపట్నం డిసెంబర్ తేది 18ప్రజాపాలన ప్రతినిధి :ఇబ్రహీంపట్నం మండలం పరిధిలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్ ట్రైనింగ్ ఇవ్వడం జరుగుతుంది ఆసక్తి గల మహిళలు నవ్య పౌండేషన్ ను సంప్రదించగలరు టైలరింగ్ 90 రోజుల్లో నేర్చుకుని మీరు మీకు గా పని చేసుకుని ఉపాధి పొందే విధంగా ఉంటుందని ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు ఎంపీపీ కుర్రేష్ తెలిపారు, మహిళలు ప్రతిభను గుర్తించి. టైలరింగ్ నేర్చుకున్న వారికి గుర్తింపుగా నవ్య పౌండేషన్ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుంది ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ ఆఫీసర్ టి. ఐజయ్య, ఎంపీడీవో మహేష్ బాబు, ముత్తూట్ ఫైనాన్స్ సి ఎస్ ఆర్ ఆర్ మేనేజర్ లక్ష్మీనారాయణ, ఎస్సై నాగేందర్, నవ్య ఫౌండేషన్ చైర్మన్ శ్రీ రమ్య వేణుగోపాల్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కురుక్షేత్రంలోని మయూరధ్వజుని త్యాగానికి ప్రతిరూపమే ఆలయాల ముందున్న ధ్వజస్తంభం

**వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్**



వికారాబాద్ బ్యూరో 18 డిసెంబర్ ప్రజాపాలన : మహాభారతంలో శ్రీకృష్ణుడు ధర్మరాజు కలసి మయూరధ్వజుని యొక్క దానగుణాలను పరీక్షించి తన భక్తిని మెచ్చిన శ్రీకృష్ణుడు మయూరధ్వజునికి యుగయుగాలలో ఆలయాల ముందు ధ్వజ స్తంభంగా పూజలందుకోవాలని వరం ఇస్తాడని వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు పౌరాణిక కథను గుర్తు చేశారు. శనివారం వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ మోమిన్ పేట్ మండలం గోవిందపూర్ గ్రామంలో హనుమాన్ దేవాలయ లిధ్వజస్తంభం ప్రతిష్టాపన”లి కార్యక్రమంలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మానవాళి జీవరాసులపట్ల భక్తి శ్రద్దలతో దానగుణాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# యోగి వైపే యూపీ ప్రజలు..

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఈరోజు యూపీలో వస్తున్న మార్పులు ఆధునిక మౌలిక సదుపాయాలు వనరులను ఎలా వినియోగించుకుంటున్నాయో చూపిస్తోందన్నారు. ఇంతకుముందు ప్రజా ధనాన్ని ఎలా వినియోగించారో అందరూ చూశారని.. యోగి ప్రభుత్వం సొమ్మును యూపీ అభివృద్ధికే వినియోగిస్తుందన్నారు. ఇక్కడ ఉన్న కొన్ని రాజకీయ పార్టీలకు దేశ ప్రభుత్వంతో సమస్యలు ఉన్నాయని.. వారసత్వంతో సమస్య ఏర్పడుతుందందటూ విమర్శించారు. ఎందుకంటే వారు తమ ఓటు బ్యాంకు గురించి ఎక్కువగా ఆందోళన చెందుతున్నారని విమర్శించారు. కేంద్రం, రాష్ట్రంలోని ఈ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం యూపీ అభివృద్ధిపై దృష్టి పెట్టిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యూపీ అభివృద్ధి చెందితే దేశం కూడా పురోగతిలో పయనమవుతుందన్నారు. గంగా ఎక్స్‌ప్రెస్‌వే యుపి పురోగతికి కొత్త తలుపులు తెరుస్తుందని ప్రధాని మోడీ అన్నారు.

## పాపాఘ్నిపై రూ.60 కోట్లతో కొత్త వంతెన

(మొదటి పేజీ తరువాయి)

ఇక శాశ్వత చర్యలు సూచించేందుకు చెన్నై ఐఐటీకి చెందిన ఇంజినీరింగ్ నిపుణులు బి.నాగేశ్వరరావు, బాలసుబ్రమణియమ్‌లను రప్పించింది. వారిద్దరూ కుంగిన వంతెనను పరిశీలించారు. పాపాఘ్నిపై పాత వంతెనకు సమాంతరంగా కొత్త వంతెన నిర్మించాలని సూచించారు.దీంతో ఆర్ అండ్ బి శాఖ ప్రతిపాదనలను రూపొందించి కేంద్ర రవాణా, జాతీయ రహదారులశాఖకు పంపించింది. దీనికి కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదించింది. దాదాపు రూ.60 కోట్ల అంచనా వ్యయంతో కొత్త వంతెన నిర్మించనున్నారు. దీనికోసం సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను రూపొందిస్తున్నారు. అనంతరం టెండర్లు పిలిచి వచ్చే ఏడాది ఆగస్టు నాటికి నిర్మాణం పూర్తిచేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

పెన్నా వంతెనపై మార్చి నాటికి పియర్ నిర్మాణం

వైఎస్సార్ జిల్లాలోని జమ్మలమడుగు వద్ద పెన్నానదిపై ఉన్న వంతెనలో కుంగిన శ్లాబ్ స్థానంలో కొత్తది నిర్మించాలని నిర్ణయించారు. ఇటీవల భారీ వర్షాలకు ఆ వంతెన ఒక పియర్ కుంగింది. వంతెనను పరిశీలించిన చెన్నై ఐఐటీ ఇంజినీరింగ్ నిపుణులు మిగిలిన భాగమంతా పటిష్టంగా ఉందని నివేదిక ఇచ్చారు. కుంగిన పియర్ స్థానంలో కొత్తగా శ్లాబ్ వేస్తే సరిపోతుందని సూచించారు. దీంతో రూ.10 కోట్లతో శ్లాబ్ వేయాలన్న ప్రతిపాదనల్ని రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. ఈ పనులను త్వరలో మొదలు పెట్టి మార్చి నాటికి పూర్తిచేయాలని భావిస్తున్నారు. ప్రస్తుతానికి పెన్నానదిలో డైవర్షన్ రోడ్డు నిర్మించి నదీ ప్రవాహాన్ని పైపుల ద్వారా మళ్లిస్తున్నారు.మార్చి నాటికి పియర్ నిర్మించి వంతెనపై రాకపోకలను అనుమతించాలని ఆర్అండ్‌బి శాఖ భావిస్తోంది.

## సంగారెడ్డి జిల్లా లో పిఎంజిఎస్.వై. రోడ్ల జాతీయ నాణ్యత నిపుణులు బినయ్ కుమార్ సిన్హాకు ఘన సన్మానం



హైదరాబాద్ 18 డిసెంబర్ ప్రజాపాలన ప్రతినిధి: ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన (పి.యం.జి.ఎస్.వై) రోడ్ల జాతీయ నాణ్యత నిపుణులు బినయ్ కుమార్ సిన్హాకు ఘనసన్మాం చేసిన పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు.సంగారెడ్డి జిల్లా పరిధిలో ప్రగతి లో ఉన్న ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం ద్వారా మంజూరైన పలు రోడ్ల నాణ్యతను పరిశీలించడానికి జాతీయ నాణ్యత నిపుణులు బినయ్ కుమార్ సిన్హా ఆదివారం నాడు సంగారెడ్డి జిల్లాకు విచ్చేశారు. పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన పలు రోడ్లను జాతీయ నాణ్యత నిపుణులు డిసెంబర్ 12 నుండి 17 వరకు తనిఖీచేశారు. జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి తుమ్మలపల్లి జగదీశ్వర్ తెలియజేశారు. శుక్రవారం నాడు (17వ తేదీ) సాయంత్రం 6 గంటలకు సంగారెడ్డి జిల్లా లోని ఓ ప్రైవేట్ హొటల్లో పర్యటన ముగింపు సమావేశం ఏర్పాటు చేశారు. సంబంధిత అధికారులు అందరు సమావేశానికి హాజరు అయిదారు. జిల్లాలో జాతీయ నాణ్యత నిపుణుల తనిఖీ పూర్తి అయిన సందర్భంగా జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి తుమ్మల పల్లి జగదీశ్వర్, ఆందోల్ పంచాయతీ రాజ్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అంజయ్య తాల్క, డిఇ లు రావూరి రామారావు సత్యనారాయణ రెడ్డి కొండయ్య సంబంధించిన పి.ఎం.జి.ఎస్.వై అధికారులు జాతీయ నాణ్యత నిపుణులు బిన్ కుమార్ సిన్హా ను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

## ఏపీలో టింగరి పాలన: లంకా దినకర్



అమరావతి: ఏపీలో ఇప్పటిదాకా రివర్స్ పాలన జరుగుతుందని అనుకున్నామని, ఇప్పుడు టింగరి పాలన మొదలయ్యిందని బీజేపీ నేత లంకా దినకర్ అన్నారు. మద్యం ధరలు పెంచితే వినియోగం తగ్గుతుందని ఆనాడు జగన్ చెప్పారన్నారు. కానీ ఇప్పుడు మద్యం వినియోగం పెంచడానికి ధరలు తగ్గిస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు. జగన్ కాకమ్మ కథలు ఆపి, మద్యం నిషేధం ఏప్పుడు విధిస్తారో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# మాస్ రాజా తో బాలయ్య

# అన్ స్టాపబుల్.. ఆ పుకార్లకు చెక్



నందమూరి బాలకృష్ణ ఆహా షో అన్ స్టాపబుల్ సూపర్ సక్సెస్ ఫుల్ గా దూసుకు పోతుంది. బాలయ్య హోస్ట్ గా ఎలా చేస్తాడో అనే అనుమానాలు చాలా మందికి ఉండేవి. కాని ఇప్పుడు అవన్ని పటా పంచలు అయ్యాయి. మొదటి ఎపిసోడ్ ను మోహన్ బాబుతో.. రెండవ ఎపిసోడ్ ను నానితో చేసిన బాలయ్య చేతికి ఆపరేషన్ వల్ల రెండు మూడు వారాల గ్యాప్ తీసుకుని మళ్లీ బ్రహ్మానందంతో అన్ స్టాపబుల్ షో ను కంటిన్యూ చేస్తున్నాడు. ఈ వారం రాజమౌళి మరియు కీరవాణిలు స్పెషల్ గెస్టులుగా రాగా తర్వాత వారంకు మాస్ మహారాజా రవితేజ మరియు దర్శకుడు గోపీచంద్ మలినేని గెస్ట్ లుగా రాబోతున్నట్లుగా ఆహా టీమ్ ద్వారా సమాచారం అందుతోంది. ఇప్పటికే మహేష్ బాబు ఎపిసోడ్ ను షూట్ చేసి పెట్టారు. అది ఏదైనా ప్రత్యేక సందర్భం కోసం హోల్డ్ లో పెట్టినట్లుగా తెలుస్తోంది. సంక్రాంతికి ఆ ఎపిసోడ్ ను స్ట్రీమింగ్ చేసేలా ఆహా వారు ప్లాన్ చేస్తున్నారేమో తెలియాల్సి ఉంది. బాలయ్య అన్ స్టాపబుల్ లో క్రాక్ హీరో రవితేజ మరియు గోపీచంద్ మలినేని రాబోతుండటం చర్చనీయాంశం అయ్యింది. గత కొంత కాలంగా బాలకృష్ణ మరియు రవితేజల మధ్య కాస్త విభేదాలు ఉన్నాయేమో అనే చర్చలు మీడియాలో జనాల్లో జరిగింది. ఎందుకంటే బాలకృష్ణ పలు సినిమాలతో రవితేజ సినిమాలు పోటీ పడ్డాయి. అందులో రవితేజ సినిమాలు పై చేయి సాధించిన సందర్భాలు ఉన్నాయి. కావాలని పోటీగా బాలయ్య సినిమాకు రవితేజ సినిమాలు పోటీగా వస్తున్నాయా అనే అనుమానాలు కూడా వ్యక్తం అయ్యాయి. రవితేజ మరియు బాలయ్య లు బాక్సాఫీస్ వద్ద పలు సందర్భాల్లో ఢీ కొట్టారు. పైగా రవితేజ ను మెగా కాంపౌండ్ మనిషి అని.. అందుకే బాలయ్య కు ఆయన వ్యతిరేకి అన్నట్లుగా కొందరు కామెంట్స్ చేస్తూ వచ్చారు. ఇద్దరి మధ్య కోల్డ్ వార్ ఎప్పుడు జరుగుతూనే ఉందని.. గత పదేళ్లుగా పుకార్లు షికార్లు చేస్తూనే ఉన్నాయి. రవితేజ సినిమాలు ఎన్నో విడుదల అవుతూనే ఉన్నాయి. వాటిలో రెండు మూడు బాలయ్య సినిమాలకు పోటీగా అనుకోకుండా పోటీగా వచ్చి ఉంటాయి. అంతే తప్ప కావాలని రవితేజ ఆ సినిమా లను బాలయ్యకు పోటీగా విడుదల చేసి ఉండడు అనేది కొందరి అభిప్రాయం అయినా కూడా ఎక్కువ శాతం మంది మాత్రం బాలయ్య టార్గెట్ గానే రవితేజ సినిమా లు వచ్చాయి అంటూ ఇష్టానుసారంగా పుకార్లు పుట్టించే వారు. ఇప్పుడు ఆహా లో అన్ స్టాపబుల్ ద్వారా ఆ సుదీర్ఘ పుకారును కొట్టి పారేయబోతున్నారు. రవితేజ మరియు బాలకృష్ణల మధ్య జరిగే సంభాషణలు ఎలా ఉంటాయి.. ఇద్దరు కూడా సరదాగా పెట్టే ముచ్చట్లు ఏంటీ అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గోపీచంద్ మలినేని ప్రస్తుతం బాలయ్యను డైరెక్ట్ చేస్తున్నాడు. ఆ సినిమాకు సంబంధించిన ముచ్చట్లు కూడా వచ్చే అవకాశం ఉంది. రవితేజ మరియు గోపీచంద్ లతో బాలయ్య చేసే చిట్ చాట్ ఎపిసోడ్ వచ్చే శుక్రవారం స్ట్రీమింగ్ అవ్వబోతుంది. బాలయ్య అన్ స్టాపబుల్ ఇప్పటి వరకు అన్ని ఎపిసోడ్ లకు కూడా మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు రవితేజ తో ఎపిసోడ్ వల్ల ఖచ్చితంగా మరింతగా ప్రేక్షకుల నుండి రెస్పాన్స్ రావచ్చు అంటున్నారు. ఈ టాక్ షో లో అప్పటి పోటీ గురించి ముందు ముందు పడబోతున్న పోటీ గురించి వీరు ఏమైనా మాట్లాడుకుంటారేమో చూడాలి. మొత్తానికి బాలయ్య అన్ స్టాపబుల్ లో రవితేజ రావడం శుభ పరిణామం అన్నట్లుగా అభిమానులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# బన్నీ నెక్స్ట్ ఫిల్మ్ బ్యాక్డ్రాప్ ఇదేనా?



ఇప్పుడు పాన్ ఇండియా స్థాయిలో ఎక్కడి విన్నా ఒకటే మాట పుష్ప.. పుష్ప.. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటించిన ఈ చిత్రం ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన విషయం తెలిసిందే. బన్నీ - సుక్కుల కాంబినేషన్ లో ముచ్చటగా మూడవసారి వస్తున్న సినిమా కావడంతో ఈ చిత్రంపై సహజంగానే భారీ అంచనాలు నెలకొన్నాయి. పాన్ ఇండియా స్థాయిలో ఈ మూవీకి క్రేజ్ ఏర్పడింది. దీంతో సినిమాకు వరల్డ్ వైడ్ గా భారీ స్థాయిలో ఓపెనింగ్స్ లభించాయి. ఫస్ట్ పార్ట్ కి మంచి టాక్ రావడంతో బన్నీ - సుక్కు పార్ట్ 2ని పూర్తి చేసే పనిలో నిమగ్నం కాబోతున్నారు. కొంత విరామం తరువాత ప్రీ ప్రొడక్షన్ వర్క్ని స్పీడప్ చేసి పార్ట్ 2ని కంప్లీట్ చేయబోతున్నారట. ఇదిలా వుంటే ఈ మూవీ తరువాత అల్లు అర్జున్ .. మాసీవ్ యాక్షన్ చిత్రాల దర్శకుడు బోయపాటి శ్రీనుతో ఓ భారీ చిత్రాన్ని చేయబోతున్నట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఇద్దరి మధ్య కథా చర్చలు జరిగినట్టుగా ఇండస్ట్రీ వర్గాల్లో ఓ ఇంట్రెస్టింగ్ స్టోరీ వినిపిస్తోంది. బోయపాటి శ్రీను రీసెంట్గా నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా తెరకెక్కించిన అఖండ చిత్రంతో తిరుగులేని బ్లాక్ బస్టర్ హిట్ ని సొంతం చేసుకున్నారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం బాలకృష్ణ చిత్రాల్లో సరికొత్త కార్డులు సృష్టిస్తూ బాక్సీఫీస్ వద్ద భారీ వసూళ్లని రాబడుతోంది. ఈ సినిమా ఇచ్చిన సక్సెస్ జోష్ లో వునన్న బోయపాటి శ్రీను తన తదుపరి చిత్రం కోసం భారీ స్కెచ్ ని సిద్ధం చేసుకున్నట్టుగా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ చిత్రాన్ని అల్లు అర్జున్ తో అత్యంత భారీ స్థాయిలో చేయాలని ప్లాన్ చేస్తున్నారట. ఇప్పటికే స్క్రిప్ట్ వర్క్ మొదలుపెట్టిన బోయపాటి ఈ చిత్రాన్ని భారత స్వాతంత్ర్యం నేపథ్యంలో సాగే ఓ వీరుడి కథగా అత్యంత శక్తివంతంగా ఈ చిత్రాన్ని తెరపైకి తీసుకురావాలనుకుంటున్నారట. బన్నీ పుష్ప -2 ని పూర్తి చేసిన వెంటనే ఈ పిరియాడిక్ స్టోరీని పట్టాలెక్కించాలనే ఆలోచనలో వున్నట్టుగా ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో అత్యంత భారీ తారాగణంతో భారీ బడ్జెట్తో రూపొందనున్న ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ బ్యానర్ పై ఏస్ ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ నిర్మించనున్నారని తెలిసింది. ఈ ప్రాజెక్ట్ కి సంబంధించిన మరిన్ని వివరాల్ని చిత్ర బృందం వచ్చే ఏడాది ప్రకటించే అవకాశం వుందని తెలిసింది. బన్నీ - బోయపాటి ల కలయికలో ఇంతకు ముందు సరైనోడు వంటి హై వోల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ రూపొందిన విషయం తెలిసిందే.

# రాజమౌళికి షాకిచ్చిన రణ్ బీర్ కపూర్



బాలీవుడ్ క్రేజీ హీరో రణ్ బీర్ కపూర్ మన పాన్ ఇండియా డైరెక్టర్ జక్కన్నకు ఉన్నట్టుండి షాకిచ్చాడు. వివరాల్లోకి వెళితే... దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన బాహుబలి ప్రంచ సినిమాకు టాలీవుడ్ సత్తాని చాటి తెలుగు సినిమాని శిఖరాగ్రాన నిలబెట్టింది. ప్రపంచ వ్యాప్తంగా రికార్డు స్థాయి వసూళ్లని రాబట్టడమే కాకుండా ఈ తరహా భారీ చిత్రాలకు ధైర్యాన్నిచ్చింది. దీంతో దక్షిణాదితో పాటు ఉత్తరాదిలోనూ ఈ తరహా లార్జర్దెన్ లైఫ్ చిత్రాల పరంపర మొదలైంది. ఈ క్రమంలోనే వరుసగా బాలీవుడ్ లో రూపొందుతున్న చిత్రం బ్రహ్మాస్త్ర. అయాన్ ముఖర్జీ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అమితాబ్ బచ్చన్ రణ్ బీర్ కపూర్ అలియాభట్ నాగార్జున మౌనీరాయ్ డింపుల్ కపాడియా కీలక అతిథి పాత్రలో షారుక్ ఖాన్ నటిస్తున్నారు. మూడు భాగాలుగా రానున్న ఈ మూవీ ఫస్ట్ పార్ట్ ని వచ్చే ఏడాది సెప్టెంబర్ లో రిలీజ్ చేయబోతున్నారు. తొలి పార్ట్ బ్రహ్మాస్త్ర పార్ట్ 1 శివగా రానున్న ఈ మూవీ ప్రమోషన్స్ ని చిత్ర బృందం ఇప్పటికే ప్రారంభించింది. తాజాగా శనివారం ఈ చిత్ర మోషన్ పోస్టర్ రిలీజ్ ప్రెస్మీట్ ని చిత్ర బృందం హైదరాబాద్లో నిర్వహించింది. ఈ కార్యక్రమంలో అలియాభట్ రణ్ బీర్ కపూర్ నాగార్జున దర్శకుడు అయాన్ ముఖర్జీలతో పాటు ముఖ్య అతిథిగా జక్కన్న రాజమౌళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర దర్శకుడు అయాన్ ముఖర్జీపై సంచలన వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆ తరువాత స్టేజ్పైకి వచ్చిన బాలీవుడ్ క్రేజీ హీరో రణ్ బీర్ కపూర్ మన పాన్ ఇండియా డైరెక్టర్ జక్కన్నకు ఉన్నట్టుండి షాకిచ్చాడు. శనివారం సినిమా మోషన్ పోస్టర్ రిలీజ్ కోసం హైదరాబాద్ వచ్చిన రణ్ బీర్ కపూర్మీడియా సాక్షిగా దర్శకధీరుడు రాజమౌళి కళ్లకు మొక్కడం పలువురిని ఆశ్చర్యానికి గురయ్యేలా చేసింది. ఓ సీనియర్ దర్శకుడికి ఏజ్ పై బడిన సీనియర్ దర్శకుడికి మాత్రమే దక్కే అరుదైన గౌరవం రాజమౌళికి దక్కడం అది కూడా ఓ బాలీవుడ్ క్రేజీ హీరో మీడియా ముఖంగా లైవ్ లో రాజమౌళి కాళ్లు మొక్కి ఆశీర్వాదం తీసుకోవడం ప్రస్తుతం టాలీవుడ్ బాలీవుడ్ లో హాట్ టాపిక్ గా మారింది. రణ్ బీర్ కపూర్.. దర్శకుడు రాజమౌళి ఆశీర్వాదం తీసుకుంటున్న వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ గా మారడం తో తెలుగు అభిమానులే కాదు.. టాలీవుడ్ ఇండస్ట్రీ వర్గాలు కూడా రాజమౌళిని చూసి గర్వంగా ఫీలవుతున్నారు.

# నా దృష్టిలో ఐటమ్ సాంగ్స్ అన్నీ భక్తి గీతాలే..!



రాక్ స్టార్ దేవిశ్రీప్రసాద్ ప్రస్తుతం దక్షిణాది అగ్ర సంగీత దర్శకులలో ఒకరిగా కొనసాగుతున్నారు. ఐటమ్ సాంగ్స్ కంపోజ్ చేయడంలో తనకు తిరుగులేదని అనిపించుకున్నారు దేవిశ్రీ. కెరీర్ ప్రారంభం నుంచీ ఎన్నో సూపర్ హిట్ ప్రత్యేక గీతాలకు స్వరాలు సమకూర్చిన దేవి.. మాస్ ఆడియన్స్ ని విపరీతంగా అలరించారు. అయితే అవన్నీ ఐటమ్ సాంగ్స్ కాదని.. భక్తి గీతాలని దేవిశ్రీ అభిప్రాయ పడుతున్నారు. దేవిశ్రీప్రసాద్ సంగీతం అందించిన "పుష్ప: ది రైజ్" సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అల్లు అర్జున్ - సుకుమార్ - దేవిశ్రీ కాంబోలో వస్తున్న ఈ సినిమా పై ముందు నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. దీనికి తగ్గట్లుగానే ఇందులోని అన్ని పాటలూ సూపర్ రెస్పాన్స్ తెచ్చుకున్నాయి. ముఖ్యంగా 'ఊ అంటావా మావా.. ఊఊ అంటావా' పాట సోషల్ మీడియాను షేక్ చేసింది. గతంలో వీరి కలయికతో వచ్చిన 'అ అంటే అమలాపురం' 'రింగ రింగా' తరహాలోనే 'పుష్ప' ఐటమ్ సాంగ్ లిరికల్ వీడియోకి స్పందన లభించింది. ఈ స్పైసీ ఐటెమ్ నంబర్ కు చంద్రబోస్ లిరిక్స్ రాయగా.. ఇంద్రవతి చౌహాన్ ఆలపించింది. ఇందులో బన్నీతో కలిసి సమంత చిందులు వేసింది. మగవాళ్ళ బుద్ధి వంకర అంటూ వచ్చిన ఈ స్పెషల్ సాంగ్ గురించి ఇటీవల దేవిశ్రీప్రసాద్ మాట్లాడారు. "అది ప్రేక్షకులకు మాత్రమే ఐటమ్ సాంగ్.. మ్యూజిక్ కంపోజర్ గా నాకు ఇది మరొక పాట మాత్రమే. ఆ సిచ్యుయేషన్ కు తగ్గట్లుగా బెస్ట్ సాంగ్ ఇవ్వాలని అనుకుంటాను. 'ఏ బిడ్డా' 'శ్రీవల్లి' ఎలాగో అది కూడా ఒక సాంగ్ అంతే. నా దృష్టిలో ఐటమ్ సాంగ్స్ అన్నీ డివోషనల్ సాంగ్స్. మనల్ని ఒక ట్రిప్ లోకి తీసుకెళ్లేది డివోషనల్ మెడిటేషన్.. అది ఐటమ్ సాంగ్ అయితేనేం మరేదైతేనేం. ట్యూన్ లో దేవుడికి సంబంధించిన లిరిక్స్ వేస్తే అది భక్తిగీతం అవుతుంది. అలాంటి వాటిలో నాకు 'ఊ అంటావా' బెస్ట్ సాంగ్" అని దేవిశ్రీప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా 'రంగ రింగా' పాట ట్యూన్ కు 'నాకు ఉన్న కోరికలన్నీ.. నువ్వు తీర్చాలి స్వామీ..' అంటూ భక్తి గీతం వినిపించారు దేవీ. అలానే 'ఊ అంటావా మావా' పాటకు కూడా 'ఊ అంటావా స్వామీ.. ఊఊ అంటావా స్వామీ' అంటూ మరో గీతాన్ని ఆలపించారు. 'కెవ్వు కేక' కూడా అంతే అని అన్నారు. "నాకు ఏ పాటైనా ఒకటే. 'రంగ రంగ' ఎలాగో.. 'ఫీల్ మై లవ్' కూడా అలానే. నాకు అవన్నీ మ్యూజిక్ మాత్రమే. అందుకే ఎవరైనా ఐటమ్ సాంగ్ అన్నప్పుడు 'వీడెవడు ఐటమ్ లాగా ఉన్నాడు' అనిపిస్తుంది నాకు. ఎందుకంటే నేను ఐటమ్ రాజా అని ఫీల్ అవుతుంటా" అని డీఎస్పీ చెప్పారు. అన్నమాచార్య కీర్తనలకు ప్రసిద్ధి చెందిన గాయని శోభారాణి గారిని ఉటంకిస్తూ.. గీతా జయంతి సందర్భంగా 'ఊ అంటావా' ట్యూన్ లో భక్తిగీతాన్ని అప్లోడ్ చేశారని దేవిశ్రీప్రసాద్ వెల్లడించారు. 'ఊ అంటావా మాధవా.. ఊఊ అంటావా' అనే లిరిక్స్ తో చేసిన డివోషనల్ సాంగ్ గూస్ బంప్స్ తెప్పిస్తోందని.. ప్రస్తుతం ఈ పాటను అందరూ షేర్ చేస్తున్నారని డీఎస్పీ తెలిపారు. 'పుష్ప' పాటల కోసం ఎప్పుడూ ఒత్తిడి ఫీలవలేదని.. కొత్తగా చేయాలని అనుకున్నానని చెప్పుకొచ్చారు.

## నెవర్ బిఫోర్ ప్లానింగ్ తో వస్తున్న "రాధే శ్యామ్".!

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా పూజా హెగ్డే హీరోయిన్ గా దర్శకుడు రాధా కృష్ణ తెరకెక్కించిన భారీ బడ్జెట్ పాన్ ఇండియా సినిమా "రాధే శ్యామ్" కోసం అందరికీ తెలిసిందే. భారీ అంచనాలు నెలకొల్పుకున్నా ఈ చిత్రం వచ్చే ఏడాది సంక్రాంతి రేస్ లో రిలీజ్ కి రెడీగా ఉంది. ఇక ఇదిలా ఉండగా ఈ సినిమా నుంచి ఇప్పుడు ఒక్కో సాంగ్ రిలీజ్ అవుతూ వస్తున్నాయి. ఇక మేకర్స్ ఈ సినిమాపై రెండు బిగ్ అప్డేట్స్ ని ఒకే రోజు ప్లాన్ చేశారు. అదే ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుక మరియు సినిమా మోస్ట్ అవైటెడ్ ట్రైలర్ లాంచ్. అయితే ఈ స్పెషల్ డే ని మాత్రం నెవర్ బిఫోర్ గా ప్లాన్ చేస్తున్నారు. ఈ డిసెంబర్ 23న నేషనల్ లెవెల్లో మొట్ట మొదటి సారిగా ఈ ఈవెంట్ ని రామోజీ ఫిల్మ్ సిటీ లో ప్లాన్ చేస్తున్నారట. అలాగే అదే రోజున ఫ్యాన్స్ చేత ట్రైలర్ ని కూడా లాంచ్ చేయబోతున్నట్టు అధికారికంగా తెలిపారు. మరి ఈ ఫస్ట్ ఎవర్ నేషనల్ లెవెల్ ఈవెంట్ ఎలా ఉంటుందో అని ఆసక్తి మొదలైంది.


"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేడ్కర్

BUSINESS v/s SOCIAL ENGINEERING

20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?
మీరే చెప్పండి

BUSSINESS: వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు

SOCIAL ENGINEERING: సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.

స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని చారిటీకి వాడుతూ మెంబర్స్కు వచ్చే లాభాలను మెంబర్స్కు ఇవ్వటం జరుగుతోంది

అంబేడ్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేడ్కర్ టీవీ ఛానల్ను నడపటానికి వినియోగిస్తున్నాం

అంబేడ్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది

మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేడ్కర్

జై పూలే | జై భీమ్ | జై బహుజన | జై భారత్


Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at : Unyted Publications, From H.no: #5+-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com